తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాద్రాద్రి భువనగిరి
శుక్రవారం
26 జులై 2024
పేజీలు : 08
Follow :

### అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు
## ఆగస్టు15 లోగా పూర్తి చేయాలి
### కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**నలగొండ బ్యూరో,జూలై 25,(జనం సాక్షి)**
నార్కెట్ పల్లి మండలం,ఎల్లారెడ్డి గూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన పనులన్నీ ఆగస్టు15 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన ఎల్లారెడ్డి గూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆఖస్మిఖంగా తనిఖీ చేశారు.పాఠశాల తరగతి గదులు,వంటగది,తాగునీటి సౌకర్యం,ప్రహరీ,పాఠశాల ఆటస్థలం,టాయిలెట్స్ తదితర సౌకర్యాలను పరిశీలించి వివరాలను హెడ్మాస్టర్ ను అడిగి తెలుసుకున్నారు.పాఠశాలలో టాయిలెట్స్ తో పాటు,తాగునీటి మరమ్మతులు,తరగతి గదుల మరమ్మతు పనులు చేపట్టడం జరిగిందని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా,వీటన్నిటిని ఆగస్టు15 నాటికి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. పాఠశాల ప్రహరీ ఎత్తు పెంచాలని,పాఠశాలలకు అనుకొని ఉన్న స్థలాన్ని చదును చేస్తే విద్యార్థులు ఆడుకునేందుకు అనువుగా ఉంటుందని,అదేవిధంగా పాఠశాల హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ఆనుకొని ఉండటం, రోడ్డు నుండి పాఠశాలకు మల్లే చోట మలుపు ఉన్నందున ఎక్కువగా యాక్సిడెంట్లు జరుగుతున్నాయని, ప్రహరీ చిన్నగా ఉండటం వల్ల సాయంత్రం, రాత్రి సమయాలలో పాఠశాలలోకి జులాయిలు వస్తున్నారని, పాఠశాల లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు, సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులతో పాటు,విద్యార్థులు ,గ్రామస్తులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ముందుగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులను పూర్తి చేసిన తర్వాత రెండవ విడత తక్కిన సమస్యలన్నింటిపై దృష్టి సారిస్తామని కలెక్టర్ తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ పదవ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. బయోలాజికల్ సైన్స్ పాఠం జరుగుతుండగా,డిజిటల్ విధానం ద్వారా పిల్లల పరిజ్ఞానాన్ని,డిజిటల్ బోధన తీరును ఆయన పరిశీలించారు. మొత్తం పాఠశాలలో 109 మంది విద్యార్థులు ఉన్నారని,సరిపోయినన్ని తరగతి గదులు, సౌకర్యాలు ఉన్నాయని పాఠశాల హెడ్ మాస్టర్ జిల్లా కలెక్టర్ కు తెలియజేశారు.గత సంవత్సరం 25 మంది పదవ తరగతి విద్యార్థులకు గాను 22 మంది ఉత్తీర్ణత సాధించారని,ఒకరికి 9.2 జిపిఏ వచ్చిందని తెలిపారు.జిల్లా కలెక్టర్ విద్యార్థు లతో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల మాదిరిగానే ప్రభుత్వ పాఠశాలలో సైతం విద్యార్థులు10 కి10 జీపీఏ వచ్చే విధంగా కష్టపడి చదవాలని,పాఠశాలలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని,మనిషి జీవితంలో 22 సంవత్సరాల వయసు వచ్చేవరకు చాలా ముఖ్యమైన సమయమని,ఎట్టి పరిస్థితిలలో దీనిని వృధా చేసుకోవద్దని, అలాగే చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా బాగా చదువుకోవాలని పిలుపు నిచ్చారు. ఎవరికీ వారు వారిని తీర్చిదిద్దుకునేందుకు కష్టపడి చదవడం ఒక్కటే మార్గం అని తెలిపారు.డిఆర్ డి ఓ,మండల ప్రత్యేక అధికారి నాగిరెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ భూమన్న,డిప్యూటీ ఇంజనీర్ మహేష్ ఎంపీడీవో ఉమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు, ఉపాధ్యాయులు తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## పొంచి ఉన్న డబుల్ డేంజర్
### - పేదోడికలకు పట్టాలతో పై కప్పు



చంద్రుగొండ జులై 25 (జనంసాక్షి ):
పేదల కల సాకారం చేసే లక్ష్యంతో గత ప్రభుత్వం నిర్మించిన రెండు పడకల ఇండ్లు ప్రమాద భరిత నిలయాలయ్యాయి. పూరీళ్లకు, పక్కా నివాసాలకు పెద్దగా తేడా లేని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు స్లాబు పై పెచ్చులు ఊడి ఏ క్షణాన పడిపోతుందోనన్న ఆందోళన లబ్ధిదారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. వివరాల్లోకెళ్తే... మండలంలోని మద్దుకూరు, చంద్రుగొండ, తిప్పనపల్లి, బెండలపాడు, తుంగారం గ్రామాలలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో లబ్ధిదారులైన వందలాది కుటుంబాలు తలదాచుకుంటున్నాయి. ఆది నుంచి అసౌకర్యాల మధ్య ఇండ్ల నిర్మాణం జరిగిందని ఆరోపణలు ఉన్న నేపథ్యంలో కట్టడంలో కనీస నాణ్యత ప్రమాణాలు లేవని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు స్లాబ్ పై పెచ్చులు ఊడిపడడం, వర్షపు నీరు ధారాళంగా అర్భులను ఆందోళనకు గురిచేస్తుంది. తడిసిన గోడలు చెమ్మ పట్టడంతో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. డ్రైనేజీ సౌకర్యం లేకపోవడం, వీధులు బుడదమయమవ్వడం, రక్షిత తాగునీరు లభించకపోవడం వెరసి లబ్ధిదారుల జీవితాల్లో ప్రాణభయం నెలకొంది. చేసేదేమీ లేక ఇంటి పై కప్పుల పై పట్టాలేసుకొని తలదాచుకుంటున్న పేద ప్రజలకు జరగరాని ప్రమాదం జరిగితే బాధ్యులేవరనేది లబ్ధిదారుల్లో మెదులుతున్న సమాధానం దొరకని ప్రశ్న....



## ఉద్యోగులు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### ప్రత్యేక వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్య పరీక్షలు చేయించుకున్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఖమ్మం బ్యూరో, జూలై 25(జనంసాక్షి)
జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల ఆరోగ్య పరిరక్షణ దిశగా హెల్త్ ప్రొఫైల్ రూపకల్పనకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంకల్పించి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్ రూపొందించడం జరిగింది. ఇట్టి ప్రత్యేక వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించడంతో పాటు, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అధికారులు, ఉద్యోగుల హెల్త్ ప్రొఫైల్ రూపకల్పనపై వైద్యాధికారులు కలెక్టర్ సూచనలు చేశారు. ప్రత్యేక వైద్య శిబిరంలో అవసరమైన మేర రిజిస్ట్రేషన్ కేంద్రాలు, శాంపిల్ కలెక్షన్ కేంద్రాలు, ఉద్యోగులు కన్సల్టేషన్ చేసేందుకు వీలుగా వైద్యులను అందుబాటులో ఉంచారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఉద్యోగిని వైద్యులు పరీక్షించి, వారి మెడికల్ హిస్టరీ తెలుసుకొని అవసరమైన పరీక్షలు చేశారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో అధికారులు, ఉద్యోగులకు సిబిపి (కంప్లీట్ బ్లడ్ పిక్చర్) పరీక్ష నిర్వహించి హిమోగ్లోబిన్ రక్త కణాల సంఖ్య, తెల్ల రక్త కణాల వివరాలను, ఆర్.బి.ఎస్. (రాండమ్ బ్లడ్ షుగర్) ద్వారా మధు మేహం స్థాయి, ఎల్.ఎఫ్.టి. ద్వారా కాలేయ పనితీరు, ఆర్.ఎఫ్.టి. పరీక్ష ద్వారా కిడ్నీల పనితీరు, థైరాయిడ్ ప్రొఫైల్ లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు, ఈసీజీ, కాల్షియం, బి12, డి3 మొదలగు పరీక్షలను మిగతా 12లో..

## భక్తులకు మౌలిక వసతుల కల్పనకు శాశ్వత ప్రణాళికలు రూపొందించాలి
### కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**నల్లగొండ బ్యూరో,జూలై25,(జనం సాక్షి)**
నార్కెట్ పల్లి మండలం చెరువుగట్టు గ్రామంలో ఉన్న శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవాలయంలో భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు శాశ్వత ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు.గురువారం ఆయన చేరువుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించారు. మిగతా 12లో..



# ఇరిగేషన్, విద్య, వైద్య రంగాలకు తగ్గిన కేటాయింపులు

- సీతారామ ప్రాజెక్టుకు అరకొర కేటాయింపులు
- సంక్షేమానికి కేటాయించిన నిధులు ఖర్చు చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



ఖమ్మం (జనంసాక్షి) : తెలంగాణ అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్‌లో నీటిపారుదల, విద్య, వైద్య రంగాలకు గత బడ్జెట్లకంటే బాగా కేటాయింపులు తగ్గించారు. సీతారామ ప్రాజెక్టుకు అరకొరగా నిధులు కేటాయించారు. ఈ కేటాయింపులు చూసినట్లయితే 2030 నాటికి కూడా ఈ ప్రాజెక్టు పూర్తిఅయ్యే అవకాశాలు లేవు. ప్రాజెక్టుకు, నిర్వహణకు కలిపి 791 కోట్లు మాత్రమే కేటాయించారని, దీనిలో నిర్వహణకే అధిక మొత్తం ఖర్చు చేయబడతాయి. ప్రాజెక్టు నిర్మాణం నత్తనడకన సాగే అవకాశం ఉంది. విద్య, వైద్య రంగాలు సామాన్యుడికి అందకుండా పోయాయి. ఈ రంగాలలో కార్పొరేట్ దోపిడీ పెరిగింది. అందరికీ విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించే విధంగా కేటాయింపులు చేసి సామాన్యులకు అందుబాటులోకి తేవాల్సిన ప్రభుత్వం గతానికంటే భారీగా కేటాయింపులు తగ్గించారు. విద్య, వైద్యం అందరికీ అందితేనే నిజమైన అభివృద్ధి సాధ్యం అవుతుంది. సంక్షేమ రంగానికి కేటాయింపులు గతం కంటే పెరిగాయి. ఈ పద్దు కింద కేటాయించిన నిధులను పూర్తిగా ఖర్చు చేయాలి. సాధారణంగా సంక్షేమం పేరుతో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ రంగాలకు కేటాయిస్తూనే ఆ నిధులు ఖర్చు చేయకుండా దారిమళ్ళించే పద్ధతి గతం నుండి అమలు జరుగుతుంది. అలా కాకుండా పూర్తిగా ఖర్చు చేయాలి. వ్యవసాయ రంగానికి, రైతు కూలీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కావాలంటే 80 వేల కోట్ల రూ.లకు పైగా అవసరమవుతాయి. కానీ 72 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. వీటిని పూర్తిగా ఖర్చు చేసినా సరిపోవు. పైగా పూర్తిగా ఖర్చు చేయాలి. ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలను పూర్తిగా అమలు చేయాలి. అందుకనుగుణంగా బడ్జెట్‌లో సవరణలు చేసి, నిధులు కేటాయించాలి. సీతారామ ప్రాజెక్టు పూర్తి అయితే ఉమ్మడి ఖమ్మం జిల్లా, మహబూబాబాద్ జిల్లాలలో 9 లక్షల ఎకరాలకు పైగా సాగయ్యే అవకాశం ఉందని, అలాంటి ప్రాజెక్టు 2007 నుండి నత్త నడకన సాగుతుంది. తెలంగాణ వచ్చినా సాకారం కాలేదు. మంత్రులు చెప్పే మాటలకు, బడ్జెట్ కేటాయింపులకు ఏ మాత్రం పొంతన లేదు. కనుక దీనిని సవరించి సీతారామ ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో కనీసం 3 వేల కోట్లు కేటాయించాలి.

# దళితులు సేద్యం చేసుకుంటున్న భూమికి పట్టాదారు పాస్ బుక్కులివ్వాలి

- ఆరున్నర దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న రైతులకు న్యాయం చేయాలి
- తె.వ్య.కా సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ డిమాండ్




భువనగిరి ప్రతినిధి జూలై 25 (జనంసాక్షి) : దళితులు సేద్యం చేసుకొంటున్న ప్రభుత్వ భూమికి, పట్టాదారు పాసు బుక్కులు ఇవ్వాలి అని, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నరసింహ డిమాండ్ చేశారు. ఆరున్నర దశాబ్దాల కు పైగా సాగు చేసుకుంటున్న హన్మాపురం గ్రామ దళితులకున్యాయం జరిగేంత వరకు పోరాడుతాం అన్నారు. సాగు చేసుకుంటున్న సర్వే నెంబరు 87 లోని 15 ఎకరాల 12 గుంటల భూమిని సింగిల్ విండో డైరెక్టర్ దయ్యాల నర్సింహ్మ, రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం సదస్సులో నర్సింహ్మ మాట్లాడుతూ గ్రామంలోని సర్వేనెంబర్ 87 లోని 15 ఎకరాల 12 గంటల భూమిని 14 షెడ్యూల్డ్ కులాల కుటుంబాలకు చెందిన 29 మంది సేద్యం చేసుకుంటున్నారని తెలిపారు. ఆనాడు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పైసా పైసా కూడా పెట్టి భావి తొవ్వి , కరెంటు సాంక్షన్ చేయించుకుని మోటార్ తో నీటిని తోడి వ్యవసాయ పంటను పండించి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని గుర్తు చేశారు. పట్టాదారు పాసుబుక్కులు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి లబ్ధి పొందలేక పోయారన్నారు. బ్యాంకుల నుంచి ఎలాంటి సహాయము అందలేదని పట్టాదారు పాసు బుక్కుల కొరకు పలుమార్లు జిల్లా కలెక్టర్, ఆర్డీఒకు, స్థానిక తహసిల్దారుకు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఇప్పటివరకు ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్యకాలంలో ఆ భూములకు ధరలు పెరిగి రెక్కలు రావడంతో ఆక్రమించడానికి పక్కనున్న కొంతమంది భూస్వాములు ప్రయత్నం చేస్తున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణం స్పందించి భూమిని సర్వే చేసి హద్దురాళ్ళు ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. సింగిల్ విండో డైరెక్టర్ దయ్యాల నర్సింహ మాట్లాడుతు రెక్కాడితే గాని డొక్కానిండని దళితులు భూమిని సాగు చేసుకుని బతుకుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగుదారులైన దళితులందరికీ పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వాలని లేనిచో పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. అనంతరం నూతన పాసుబుక్కుల సాధన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా బిచ్చాల మహేందర్, ప్రధాన కార్యదర్శిగా మూడుగుల రాజు, గౌరవ అధ్యక్షులుగా మూడుగుల అంజయ్య, ఉపాధ్యక్షులుగా బండారి రామచందర్, సహాయ కార్యదర్శిగా చందుపట్ల మల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా బిచ్చాల మైసయ్య, మూడ్గుల వెంకటయ్య, మూడ్గుల బాల్ నరసింహ, బండారి జీవన్ రావ్, బిచ్చాల పరుశరాములు, పొట్ట జగన్ ఎన్నుకున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ముడుగుల బాలరాజు, బాల్ నరసింహ, మైసయ్య, కొండలు ప్రభాకర్, ఉప్పలయ్య, మహేష్, వెంకన్న, భిక్షపతి, రమేష్, నరసయ్య, మైసయ్య, కొండలు, రాజు, భిక్షపతి, లక్ష్మి, పరమేష్, కొండల్ ,సీతారాములు, మైసయ్య, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బలహీన వర్గాల చైతన్యానికి కృషిచేస్తున్న కొడారి

**సామాజిక కార్యకర్త వెంకటేష్ పుట్టినరోజు వేడుకల్లో టిపిసిసి మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నింటి స్టాన్లీ**




భువనగిరి ప్రతినిధి జూలై 25 (జనంసాక్షి) : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతిని కృషి చేస్తున్న కొడారు వెంకటేష్, భవిష్యత్తులో మరిన్ని సామాజిక ఉద్యమాలు నిర్వహించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేందుకు కృషి చేయాలని, టిపిసిసి మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నింటి స్టాన్లీ కోరుతూ ఆశీర్వదించారు. సామాజిక కార్యకర్త, హక్కుల నాయకుడు, సీనియర్ జర్నలిస్టు, మూఢ నమ్మకాల నిర్మూలనకు, కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో సాధన కోసం కృషి చేస్తున్న కొడారి వెంకటేష్ పుట్టినరోజు వేడుకలు గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఘణంగా నిర్వహించారు. మొదట భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు బట్టు రామచంద్రయ్య, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ధరణికోట నర్సింహ, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు సురుపంగ ప్రకాష్, జిల్లా ఎస్సీ/ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బర్రె సుదర్శన్, వికలాంగుల హక్కుల మహిళా అధ్యక్షురాలు కొత్త లలిత, జిల్లా నాయకులు జాగిల్లపురం అయిలయ్య, సింగారం రమేష్, కాటపల్లి రజిత, ఇంజ పద్మ , మచ్చ ఉపేందర్ పాల్గొన్నారు.

# ఉద్యోగులకు హెల్త్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయం

ఖమ్మం (జనంసాక్షి): ఖమ్మం ఐడీఓసి లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఆరోగ్య సమస్యలు పరిష్కార దిశగా ఐడీఓసీలో ప్రత్యేకంగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయటం అభినందనీయమని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అఫ్జల్ హసన్, ఆర్‌విఎస్ సాగర్ అన్నారు. ఉద్యోగులందరికీ ఆరోగ్య సమస్యల పరిష్కారం అయ్యేటట్లు టెస్టులు, ఈసీజీ సౌకర్యం ఏర్పాటు చేసి కావలసిన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేసినందుకు ప్రత్యేకంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కు, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డిఎంహెచ్ ఓ మాలతి, డిసిఎస్ శేఖర్ గౌడ్‌కి, శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు, సిబ్బందికీ పేరుపేరునా టి ఎన్ జి ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు అఫ్జల్ హసన్, కార్యదర్శి ఆర్‌విఎస్ సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నందగిరి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి జివిఎస్ ప్రసాదరావు, టీఎన్జీవోస్ ఐడిఓసి ఇంచార్జ్ ఎర్రమళ్ళ శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉద్యోగి తమ వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షించుకొని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి ఆరోగ్య సూత్రాలు పాటించాలని కోరారు. గౌరవ కలెక్టర్ ఉద్యోగుల సౌకర్యార్థం ఐడిఓసి నందు నూతనంగా బస్సు షెల్టర్ నిర్మిస్తున్నందుకు, ఐడిఓసిలో బ్యాంకు, ఎటిఎం ఏర్పాటు చేస్తున్నందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# పేద పిల్లలను ఆదుకోవడమే గ్రేస్ సొసైటీ లక్ష్యం

## సంస్థ బాధ్యులు టి.ఆదినారాయణ




ఖమ్మం రూరల్, జూలై 25:( జనం సాక్షి)

ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే పేద పిల్లలను ఆదుకోవడమే గ్రేస్ సర్వీసెస్ సొసైటీ లక్ష్యమని సంస్థ బాధ్యులు టి. ఆదినారాయణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఏం. వెంకటాయ పాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 170 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు గ్రేస్ సొసైటీ సర్వీసెస్ ఎప్పుడు అండగా నిలుస్తుందని అన్నారు. గతంలో కూడా గ్రేస్ సొసైటీ సంస్థ వారు ఇదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు దుప్పట్లు మరియు ఒక కిట్టును అందజేయడం జరిగిందని,అదేవిధంగా రానున్న కాలంలో కూడా ప్రతి సంవత్సరం విద్యార్థులకు అందించే విధంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ సర్వీసెస్ బాధ్యులు మురళీధర్ రెడ్డి, సతీష్, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డివిఎన్ ప్రసాద్, శ్రీనివాసరావు, నవీన్, జెసన్,సిహెచ్ జగదీష్, విజయలక్ష్మి, కృపాబాయి,ఆర్ సునీత బి సునీత, శాంతమ్మ పిడి. విజయకుమార్,అర్చన వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


## బహిరంగ వేలం ప్రకటన

తేదీ 30.07. 2024న ఉదయం 10 నుండి 12 గంటల వరకు పోలీస్ స్టేషన్‌లో గుర్తింపు లేని మరియు వదిలివేసి వెళ్లిన (17) వాహనాలను పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి చెందిన వాహనాలకు సంబంధించిన పాత ఇనుప సామానులు, పాత బ్యాటరీలు మరియు టైర్లను బహిరంగ వేలం పాట నిర్వహించబడును. కావున ఆసక్తి గల వారు ఇట్టి బహిరంగ వేలంపాటకి హాజరై దక్కించుకోగలరు.

**- పోలీస్ కమిషనరేట్ ఖమ్మం**

# జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేద్దాం



- ఆశించే స్థాయి నుంచి.. శాసించే స్థాయికి బీసీలు ఎదగాలి
- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొత్త నరసింహస్వామి
- ఆగస్టు 7న పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో జరిగే అఖిల భారత జాతీయ ఓబిసి 9వ మహాసభ గోడపత్రికల ఆవిష్కరణ

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జులై 25 (జనంసాక్షి)** : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద.. బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొత్త నరసింహస్వామి అధ్యక్షతన..జాతీయ ఓబీసీ 9వ మహాసభ గోడపత్రికల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కొత్త నరసింహస్వామి మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ గారి పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జాతీయ ఓబీసీ 9వ మహాసభ గోడపత్రికలను ఆవిష్కరించడం జరిగింది. బీసీలు ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలనే సంకల్పంతో దేశమంతా బీసీ ఉద్యమాన్ని విస్తరించి, ఢిల్లీ కోటపై బహుజన జెండాను ఎగురవేసేందుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో ఉద్యమాలు కొనసాగుతున్నాయని, మన చెమట చుక్కల ద్వారా మన నెత్తుటిని చిందించి దేశ సంపదను సృష్టించే మనం, అన్ని రంగాల్లో వెనుకబడడానికి కారణం చట్టసభల్లో రిజర్వేషన్లు లేకపోవడమేనన్నారు.

దేశ జనాభాలో 60 శాతంకు పైగా ఉన్న మనం, విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో ప్రాతినిధ్యం లేకపోవడంతో మనం అడుక్కునే స్థాయికి దిగజారితే, అరశాతం ఉన్న అగ్రవర్ణాలు అధికారం అనుభవిస్తూ, అన్ని రంగాలను వారి గుప్పిట్లో పెట్టుకున్నారన్నారు. బీసీ అంటే బ్యాక్వర్ క్లాస్ అని మనలను ఎప్పటికీ వెనకకు అని ప్రపంచానికి చాటిచెప్పేలా బీసీ లోకమంతా కంకణ బద్ధులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యా, ఉద్యోగాలలో బీసీలకు రావాల్సిన వాటాను బీసీలకు ఇవ్వాలని, బీసీలకు విధించిన క్రిమిలేయర్ రద్దు చేయాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేపట్టి, రిజర్వేషన్లలో మేమెంతో మాకు అంతా వాటా కల్పించాలని, మండల్ కమిషన్ సిఫారసులను వెంటనే నినాదంతో హలో బీసీ.. చలో అమృత్ సర్ కార్యక్రమంతో 9వ అఖిలభారత జాతీయ ఓబీసీ అమలు పరచాలని, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు కోటా విధించాలి అనే మహాసభను ఆగస్టు 7న నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ఉమ్మడి నల్గొండ జిల్లాలోని బీసీ సోదరులు, బీసీ యువత, బీసీ విద్యార్థులు, బీసీ మహిళలు అధిక సంఖ్యలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భువనగిరి నియోజకవర్గం బీసీ సంఘం నాయకులు సాబన్ కార్ వెంకటేష్, అశోక చారి, బోజ్జ సాంబేష్, విశ్వకర్మ సంఘం జిల్లా నాయకులు,దేవరకొండ నరసింహ చారి, గాజుల క్రాంతి కుమార్, కీర్తి సత్యనారాయణ, తదితర బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## బడ్జెట్ తగ్గింపుతో విద్యాభివృద్ధి ఎలా సాధ్యం

### యుఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ



**హైదరాబాద్ (జనంసాక్షి)** : రాష్ట్ర ప్రభుత్వం గత బడ్జెట్ కంటే ఈ బడ్జెట్‌లో విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులలో తీవ్ర అన్యాయం చేసిందని ఈ బడ్జెట్ కేటాయింపుతో విద్యారంగ ఎలా అభివృద్ధి అవుతుందో ప్రభుత్వం చెప్పాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ పత్రిక ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తాటికొండ రవి మాదం తిరుపతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత పాలకులు అవలంబించిన విధంగా అవలంబిస్తుందని మొత్తం బడ్జెట్ విద్యారంగానికి కేవలం 7.3 శాతం నిధులు కేటాయించడంతో ఏ రకంగా అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఓట్ ఆన్ అకౌంట్ లో 21389 నుండి అసలు బడ్జెట్ లో 21292 కు తగ్గించారు. కొఠారి కమిషన్ ప్రకారం రాష్ట్ర బడ్జెట్లో 30% నిధులు కేటాయించాలని కమిషన్ చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కేవలం పథకం శాతం కేటాయించి చేతులు దులుపుకోవడం సిగ్గుచేటు అన్నారు మన ఊరు మనబడి పథకంతో పాఠశాలలకు అభివృద్ధి చేస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం ఈ బడ్జెట్ ఏ విధంగా సరిపోతుందన్నారు యూనివర్సిటీల అభివృద్ధికి మరియు స్కిల్స్ డెవలప్మెంట్ యూనివర్సిటీ, గురుకులాలు సంక్షేమ హాస్టల్లో పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ సమస్యను ఎలా పరిష్కరిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు బడ్జెట్ కేటాయింపు లేకుండా విద్యారంగా అభివృద్ధి అనడం అవివేకమని అన్నారు. గత బడ్జెట్లో 21,389 కోట్లు కేటాయిస్తే ఈ బడ్జెట్లో 21,292 కోట్లు కేటాయించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యారంగానికి 30% నిధులు కేటాయించే విధంగా అసెంబ్లీలో ప్రకటన చేయాలని యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ రవి, యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్ కేటాయింపుతోరాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని బడ్జెట్ కేటాయింపుల నిర్లక్ష్య నిరసిస్తూ రేపు రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడం సిగ్గుచేటు

- మంత్రులకు చేసిన విజ్ఞాపనలు బేకాతర్
- రాష్ట్ర బడ్జెట్ లో విద్యారంగానికి 7.31 శాతం నిధులా ?
- అసెంబ్లీ సమావేశాల్లో జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోతే ఆందోళనలు చేపడతాం
- పిడిఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.శ్రీకాంత్



**యాదాద్రి భువనగిరి బ్యూరో (జనంసాక్షి)** : అసెంబ్లీ సమావేశాలలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ 2.91,159లో విద్యా రంగానికి 21,292 (7.31 శాతం) మాత్రమే నిధులు కేటాయించడాన్ని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ, సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.శ్రీకాంత్ నిరసిస్తున్నామన్నారు. విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో 30 శాతంనిధులు కేటాయించాలని ఇప్పటికే విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల తరపున ప్రతినిధి బృందం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి కోరినట్లు తెలిపారు. మంత్రులకు ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇచ్చిన బేకాతలు చేశారన్నారు. విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడం సిగ్గుచేటన్నారు.రాష్ట్ర బడ్జెట్‌లో ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి 100 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఉస్మానియా యూనివర్సిటీని పూర్తిస్థాయి ప్రక్షాళన చేయడానికి సుమారు 500 కోట్లకు పైగా నిధులు ఖర్చువుతుతాయని మేధావులు, విద్యావేత్తలు ముఖ్యమంత్రికి సూచించినప్పటికీ రాష్ట్రంలో ఉన్న అన్ని యూనివర్సిటీలకు కలిపి వాటి అభివృద్ధి పేరిట కేటాయించిన 500 కోట్లు ఏ మూలకు సరిపోతాయో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. కాకతీయ, తెలంగాణ, మహాత్మా గాంధీ, పాలమూరు యూనివర్సిటీలకు 200 కోట్ల రూపాయల చొప్పున, ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి కోసం 500 కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం నేటి రాష్ట్ర బడ్జెట్ సమావేశాల ప్రసంగంలో ఆ ఊసే ఎత్తకపోవడం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తే విద్యార్థి నిరుద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని స్పష్టం చేశారు. తక్షణమే రాష్ట్ర బడ్జెట్ ను సవరించి విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని,జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



## సంతాన సాఫల్య చికిత్సలకు పెరుగుతున్న ఆమోదం

### నేడు ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం

**హైదరాబాద్ (జనంసాక్షి)** : భారతదేశంలోని ప్రముఖ సంతానోత్పత్తి కేంద్రాల్లో ఒకటైన నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ హైదరాబాద్ బంజారాహిల్స్ లో పదేళ్లు పూర్తిచేసుకుంది. ఆలస్యంగా పెళ్లి చేసుకోవడం, మారుతున్న జీవనశైలి లాంటివి సంతానలేమి పెరగడానికి కారణమని ఫెర్టిలిటీ నిపుణులు చెబుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో సంతానోత్పత్తి చికిత్స కోసం 35 ఏళ్లు పైబడిన మహిళలు వస్తుండగా, గ్రామీణ ప్రాంతాల్లో మహిళల సగటు వయస్సు 22–23 సంవత్సరాలే ఉండటం ఆందోళనకరంగా ఉంది. అయితే, గత దశాబ్దంలో పురుషులలో సంతానరాహిత్య సమస్యను అంగీకరించడంలో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. తెలంగాణలోనూ పురుషులు, మహిళల్లో సంతానరాహిత్యం పెరుగుతోంది. సంతానసాఫల్య రేటు రాష్ట్రంలో తగ్గుతోంది. ఒక్కో మహిళకు సగటున 2.1 మంది పిల్లలు ఉండాలి గానీ, 1.8 మంది ఉంటున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ బంజారాహిల్స్ లోని నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీలో ఫెర్టిలిటీ నిపుణురాలు డాక్టర్ లక్ష్మీ చిరుమామిళ్ల మాట్లాడుతూ. సాంకేతిక పరిజ్ఞానంలో పురోగతి వల్ల సంతానసాఫల్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. పిల్లలు పుట్టని జంటలకు కొత్త ఆశ, మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. దాంతోపాటు.. క్రియోప్రిజర్వేషన్ వల్ల ఇప్పుడు అండాలు, వీర్యం, పిండాలను కూడా సమర్థంగా నిల్వచేయగలుగుతున్నాం. దీనివల్ల ఎవరైనా కొంత వయసు తర్వాత పిల్లలు కావాలనుకున్నా అది సులభమే అవుతుంది అని వివరించారు. కొన్నేళ్ల క్రితం అస్సలు అడిగేవారే కారు. పిల్లలు తర్వాత కావాలనుకుంటే, తమ అండాలు, వీర్యం, లేదా పిండాలను కూడా ఫ్రీజ్ చేసుకునేందుకు అవకాశం ఉంది" అని నోవా ఐవీఎఫ్‌లో మరో ఫెర్టిలిటీ నిపుణురాలు డాక్టర్ హిమదీప్తి తెలిపారు.





# ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం అభినందనీయం

**ప్రభుత్వ పాఠశాలకు గ్యాస్ కనెక్షన్,మినరల్ వాటర్ సెట్ వితరణ- డబుల్ గ్యాస్ స్టవ్, సిలిండర్,మినీ మినరల్ వాటర్ సెట్ అందజేత**

టేకులపల్లి, జులై 25 (జనంసాక్షి): ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం అభినందనీయమని, ఇలాంటి సహకారాలు ఎల్లప్పుడూ ఉండాలని టేకులపల్లి మండలం బొమ్మనపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మంగీలాల్ అన్నారు. గురువారం బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కొత్తగూడెం పట్టణానికి చెందిన ఆర్కే ట్రేడర్స్ అధినేత హన్స్ రాజ్ జకోటియా డబుల్ గ్యాస్ స్టవ్, సిలిండర్, మినీ మినరల్ వాటర్ సెట్ ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బొమ్మనపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మంగీలాల్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతుల కల్పన కోసం దాతలు ముందుకు వచ్చి తమ తోడ్పాటు అందించాలని కోరారు. బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కొత్తగూడెం కు చెందిన వ్యాపారి ఆర్కే ట్రేడర్స్ అధినేత హన్స్ రాజ్ జకోటియా దాతృత్వాన్ని ప్రదర్శించడం ప్రశంసనీయమన్నారు. ప్రతీ వ్యాపారిఆయనను ఆదర్శంగా తీసుకోవాలనీ అన్నారు. హెచ్ఎం, ఎం. జ్యోతిరాణి అధ్యక్షతన జరిగినఈ కార్యక్రమంలో పాఠశాల స్థలదాత దోర్నాల మోహన్ రావు, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు భవాని, వివేకానంద యూత్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు లగడపాటి రమేష్, కొత్తగూడెం డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, వాసవి క్లబ్ రాష్ట్ర ప్రతినిధి పల్లపోతు సాయిబాబా, అనిల్,వ్యాపారవేత్త కోడూరి రమేష్, ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ రాష్ట్ర కోఆర్డినేటర్ మహమ్మద్ ఖాసిం, ఎస్. జీ. ఎఫ్. భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు లోగాని శ్రీనివాస్,



జర్నలిస్ట్ బుర్రా శ్రీనివాసరావు, వివేకానంద యూత్ సభ్యులు వీరాచారి,ప్రవీణ్,నరేష్, టీచర్ పద్మ, ఐఆర్పీ టీచర్ నీరజ, సీఆర్పీ అబ్బయ్య,అంగన్వాడీ టీచర్స్ గుర్రం విజయలక్ష్మి, విజయ, వాలంటీర్ శారద,వివో రోజా,విద్యార్థుల తల్లిదండ్రులు నవగన్య, నవ్యశ్రీ,, సారిక, నారందాసు సతీష్, ఎండీమ్ వర్కర్ బంద సరోజ, మేకల పార్వతిదేవి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శిక్షా సప్తాహ్‌లో భిన్నత్వంలో ఏకత్వం

టేకులపల్లి, జూలై 25 (జనం సాక్షి):
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యాశాఖల సంయుక్త పిలుపుమేరకు లిశిక్ష సప్తాహ్‌లి లో భాగంగా నాలుగో రోజు గురువారం టేకులపల్లి మండలం బొమ్మనపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కల్చరల్ డే కార్యక్రమం నిర్వహించారు. బొమ్మనపల్లి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మంగీలాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు భిన్నత్వం లో ఏకత్వం గురించి, మన సంస్కృతి సంప్రదాయం గురించి హెచ్ఎం, ఎం.జ్యోతిరాణి విద్యార్థులకు సవివరంగా చెప్పారు. ఈ నెల 29 వరకు జరగనున్న ఈ శిక్ష సప్తాహ్ లో భాగంగా ప్రతిరోజు జరిగే కార్యక్రమంలో జాతీయ విద్యా విధానం అమలు లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర విద్యా శాఖలు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈ కల్చరల్ డే ఘనంగా నిర్వ హించారు. విద్యార్థులు జాతీయ సమైక్యతను చాటి చెప్పే విధంగా విభిన్న వస్త్ర అలంకరణలు, జాతీయ నాయకుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు భవాని, వివో రోజా, అసిస్టెంట్ టీచర్ పద్మ,సీఆర్పీ అబ్బయ్య, ఐఆర్పీ టీచర్ నీరజ, అంగన్వాడీ టీచర్స్ విజయలక్ష్మి, విజయ,వాలంటీర్ శారద, పేరెంట్స్ నవగణ్య, సారిక, నవ్యశ్రీ, సతీష్ లు పాల్గొన్నారు.

# తురకగూడెం వాసుకి ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్..

## జక్కుల రామారావుకు పలువురు అభినందనలు..

కూసుమంచి జూలై 25 (జనంసాక్షి) :
మండలంలోని ఆ ఊరు అంటేనే ఎంతోమందికి అలుసు చిన్నచూపు ఆ ఊరిని ఎంతో వెనకబడి ఉన్నదని ఆ ఊరు చైతన్యమైతే దేశమే చైతన్య మవుతుందని ఒకింత యావగింపు ఆ ఊరు ప్రజల్లో ఎక్కువగా గొల్ల ,మాదిగ ,సామాజిక వర్గాలే ఉంటాయి అందుకే ఊరు ప్రజలన్నా కొందరికి మండల కేంద్రంలో ఓహో ఆ ఊరు ప్రజల నాగరికంగా వెనకబడి ఉంటారనుకునే గ్రామం ఆ గ్రామమే మరి అదే గ్రామానికి గతంలో రాష్ట్రపతి అవార్డు అయినా నిర్మల్ గ్రామ పురస్కార్ అవార్డు 2008 సంవత్సరంలో గ్రామ సర్పంచ్ కొమ్ము సత్యం ఆధ్వర్యంలో సాధించింది .ఆ తరువాత ఇప్పుడు ఆ వెనకబడిన గ్రామ అనుకునే గ్రామం నుంచే 2024 సంవత్సరంలో ఒక రైతు బిడ్డ కు ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్గానిక్ కెమిస్ట్రీలో రసాయన శాస్త్రంలో డాక్టరేట్ సాధించాడు ఆ గ్రామమే తురక గూడెం .ఆ ఎనుకబడిన గ్రామ రైతుబిడ్డే జక్కుల రామారావు . నవ్విన నాప చేనే పండిన విధంగా తురకగూడెం గ్రామనివాసైన జక్కుల శ్రీను సావిత్రమ్మల కుమారుడు జక్కుల రామారావుకు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో డాక్టర్ ప్రధానం చేసింది .వివరాల్లోకొస్తే జక్కుల రామారావు. తురకగూడెం గ్రామంలో యాదవ సామాజిక వర్గం లో జన్మించి 1999 నుండి 2004 సంవత్సరంలో 1 నుంచి 5వ తరగతి వరకు తన స్వగ్రామమైన తురకగూడెంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యను అభ్యసించి 2004 నుండి 2009 వరకు 6 నుంచి 10వ తరగతి వరకు కూసుమంచి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి ఆ తరువాత మండల కేంద్రంలోని గల జలగం వెంగళరావు జూనియర్ కళాశాలలో 2009–11 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి 2011 –14 విద్యా సంవత్సరంలో ఆర్ జె సి కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకొని ఎస్ఆర్ కోచింగ్ సెంటర్ లో ఎమ్మెస్సీ ఎంట్రెన్స్ తీసుకొని 2018 వ సంవత్సరంలో సీఎస్ఐఆర్ యూజీసీ ఆల్ ఇండియా 102 ర్యాంకు సాధించారు. ఫెలోషిప్ పర్వత పొంది ఫెలోషిప్ సహకారంతోనే హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో సి ఎస్ ఐ ఆర్. ఐ ఐ సిటి . పీహెచ్డీ ప్రారంభించి ఐదు సంవత్సరాలు పీహెచ్డీ పూర్తయిన అనంతరం 2024వ సంవత్సరంలో తనకు ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసింది ఈ విషయం తెలుసుకున్న కూసుమంచి మండల వాసులు పలువురు విద్యాసంస్థ వేత్తలు రాజకీయ నాయకులు జక్కుల రామారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ మట్టిలో మాణిక్యం రామారావు అంటూ పలువురు అభినందనలు వ్యక్తం చేశారు.



# ఫోటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి

సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):
సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షులుగా రాగిరి మల్లేష్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో జరిగి న ఆ సంఘ సమావేశంలో ఆయనను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన అసోసియేషన్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఫోటోగ్రాఫర్ వృత్తి ఎంతో నైపుణ్యంతో కూడిన వృత్తి అని అన్నారు. ఫోటోగ్రఫీ వృత్తితో సంఘంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. మండల అసోసియేషన్ సభ్యులకు ఏ సమస్య వచ్చిన, ఆ సమస్య పరి ష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు రాచ మల్ల సంతోష్, కోశా ధికారి తాళ్లపల్లి నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆకుల నరేష్, గౌరవ అధ్యక్షులు చిలువేరు వెం కన్న, జంపాల అశోక్, రాంపాక రామలింగం, చిలువేరి చంద్రయ్య, తాళ్లపల్లి శివకృష్ణ, సభ్యు లు ప్రభాకర్, రామలింగయ్య, వెంకన్న, సం తోష్, నారాయణ, శివకృష్ణ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లు సామాజిక బాధ్యతతో మెలగాలి - ఎస్సై గంజి స్వప్న

చంద్రుగొండ జులై 25 (జనంసాక్షి ):
ఆటో డ్రైవర్లు సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని, ప్రయాణికుల పట్ల బాధ్యతగా మెలగాలని ఎస్సై గంజి స్వప్న సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. మితిమీరిన వేగం ప్రమాదకరమని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. సంబంధిత ధ్రువపత్రాలను కలిగి ఉండాలని, రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. అక్రమ రవాణా, సంఘ విద్రోహక కార్యకలాపాలను సహించబోనని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



# ఎరువులు షాపులను తనిఖీ చేసిన జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి..

నేరేడుచర్ల( జనంసాక్షి) :అధిక ధరలకు ఎరువులు పురుగు మందులు అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి అన్నారు. గురువారం నేరేడుచర్ల పట్టణ కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల్ని మండల వ్యవసాయ అధికారి ఎస్కే జావేద్ తో కలిసి తనిఖీ నిర్వహించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు స్టాక్ రిజిస్టర్ ను ప్రతిరోజు అప్డేట్ చేయాలని, ధరల పట్టికలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. వ్యవసాయ అధికారి కార్యాలయానికి వచ్చిన రైతులకు రుణమాఫీకి సంబంధించి సలహాలు సూచనలు తెలిపారు. ఎవరికైతే లక్ష లోపు రుణమాఫీ ఉండి, ప్రస్తుతానికి రుణమాఫీ కానీ వాళ్లకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సూచనలు వచ్చిన వెంటనే వారి వివరాలు ఆన్లైన్లో నమోదు చేస్తామన్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్ పంటకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతు బీమా పథకానికి సంబంధించి 18 నుండి 59 సంవత్సరాల గల రైతులందరూ వ్యవసాయ అధికారి కార్యాలయంలో వెంటనే నమోదు చేసుకోవాలన్నారు.



# అంగన్వాడీ టీచర్స్ మాయ మాటలు నమ్మవద్దు

## ఐ యన్ టీ యు సీ కొత్త సీత రాములు



ఖమ్మం ఆర్సి,జులై25(జనంసాక్షి) స్థానిక సంజీవ రెడ్డి భవన్ లో ఇందిరా ప్రియదర్శిని రాష్ట్ర అంగన్వాడీ టీచర్స్, వర్కర్స్ యూనియన్ ఐయన్టీసీ అను బంధం సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు డి. విజయ కుమారి, ఐ యన్ టీ యు సీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొత్త సీతా రాములు, మరియు రాష్ట్ర గౌరవ అధ్యక్షు రాలు కొండా పద్మ, జిల్లా అధ్యక్షురాలు ఉల్లంగి పద్మ, రాష్ట్ర ఆర్గనైజషన్ సెక్రటరీ సామినేని భవాని, వైస్ ప్రెసిడెంట్ దగ్గుపాటి శాంతారాజ్యం, వల్లభి యస్ వి నాగమణి, గుండపనేని నాగమణి మొదలగు వారు పాల్గొని.జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ.రాష్టం లో అంగన్వాడీలు పని భారం పెంచారు. ఖర్చులు పెరిగి, కుటుంబ పోషణకు జీతం సరిపోవడం లేదన్నారు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ లను ఆదు కోవాలని రాష్ట్ర కమిటీ తరుపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి వర్యులు సీతక్క కి ప్రత్యేక విజ్ఞప్తి చేయడం జరిగింది. ఇప్పుడున్న పరిస్థితులకు అంగన్వాడీ టీచర్స్ కనీస జీతం 30వేలు, ఆయాలకు 15వేలకు పెంచాలని, హెల్త్ కొరకు ఈ యస్ ఐ హాస్పిటల్ సౌకర్యం కల్పించాలని కోరారు. కొండా పద్మ మాట్లాడు తూ.రాష్ట వ్యాపితంగా 60వేల మంది అంగన్వాడీ టీచర్స్ పని చేస్తున్నారని, వీరందరిని ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలని పద్మ కోరారు. జిల్లా అధ్యక్షురాలు ఉల్లంగి పద్మ మాట్లాడుతూ.. జిల్లా లో అంగన్వాడీలను అధిక పనిలి భారం చేస్తూ, అధిక పని గంటల ద్వారా టీ ఏ.డీ.ఏ లను కల్పించాలని కోరడం జరిగింది. ఐ యన్ టీ యు సీ కొత్త సీత రాములు మాట్లాడుతూ జిల్లా అంగన్వాడీ టీచర్స్ ఇతర పార్టీ వారు చెప్పే మాయ మాటలు నమ్మవద్దని, సంఘటితం గా ఐ యన్ టీ యు సీ సభ్యులుగా చేరి, సామారస్య పూర్వకంగా హక్కులు సాదించు కోవాలని, సంఘాన్ని బలోపేతం చేయాలనీ రాష్టం లోనే ఖమ్మం జిల్లా ఆదర్శం గా అంగన్వాడీ పని చేయాలనీ కోరారు. రాష్ట ఆర్గనైజషన్ సెక్రటరీ సామినేని భవాని మాట్లాడుతూ... అంగన్వాడీ కేంద్రాలలో గందరగోళం చేసే అంగన్వాడీ లను సీనియర్స్ అంగన్వాడీ టీచర్స్‌ను వయసుతో సంబంధం లేకుండా, ఎక్సమినేషన్ లేకుండా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు యన్ హెచ్ టీ యస్, పోషణ యాప్ లను రద్దు చేయాలన్నారు. డ్యూటీ లో ఉండీ పని చేస్తూ చనిపోయిన వారి కుటుంబానికి ఆర్థికంగా సహాయం గా 10 లక్షలు, ఆయాల కుటుంబానికి 5 లక్షలు ఎక్సగ్రేసియా ఇవ్వాళన్నారు.

# అక్రిడేషన్ల ను ఉర్దూ పేపర్లకు , చానళ్లకు ఇవ్వలి

## జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ను సత్కరించి, వినతి పత్రాన్ని సమర్పించిన ఉర్దూ జర్నలిస్టులు



ఖమ్మం బ్యూరో, జూలై 25(జనంసాక్షి) జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ను గురు వారం ఉర్దూ జర్నలిస్టు లు అయన కార్యాలయంలో కలుసుకొని, శుభా కాంక్షలు ప్రకటిస్తూ.శాలువా కప్పి సత్కరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన ఒక వినతి పత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉర్దూ రెండవ అధికార భాషగా కొనసాగుతున్నప్పటికీ చాలా కాలం నుండి నిర్లక్ష్యానికి గురవుతూ వస్తున్న విషయాన్ని పేర్కొంటూ ఖమ్మం ఉమ్మడి జిల్లాలో కూడా ఇదే పరిస్థితి నెలకొందని ఉర్దూ జర్నలిస్టులు వినతి పత్రంలో పేర్కొన్నారు. రెండవ అధికార భాషగా తెలంగాణలో కొనసాగుతున్న ఉర్దూ భాష లో ప్రభుత్వ కార్యాలయాల బోర్డు మీదా రాయక పోవటాన్ని ప్రస్తావిస్తూ... ఈ తప్పి దనాన్ని సరిచేయలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తెలుగు భాష మాధ్యమంలో వస్తున్న పత్రికలకు , చానళ్ళకు ఇస్తున్న విధంగా అక్రిడేషన్ల ను ఉర్దూ పేపర్లకు , చానళ్లకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉర్దూ మీడియాకు కేవలం ఒక్కొక్క ఆక్రిడేషన్ ఇచ్చి, అసమానత ప్రదర్శిస్తు న్నారని వాపోయారు. తమ డిమాండ్లపై దృష్టి సారించి న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన ఉర్దూ జర్నలిస్టులలో యం డి. జవ్వాద్ అహ్మద్ ( ఎతే మాద్ ) , మజహర్ ( మున్సిఫ్ ) , ఇమ్రాన్ ( రహ మానే దక్కన్ ) , సయ్యద్ సాబీర్ ( సియాసత్ ) , యం డి. ఇంతి యాజ్ ( సహార ) ఎస్ కే. జాని పాష ( రూలింగ్ టీవీ ) తదితరులు ఉన్నారు.



# ఇన్స్పైర్ మానక్ కు సంబంధించిన గోడ పత్రులను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఖమ్మం బ్యూరో, జూలై 25(జనంసాక్షి) పాఠశాల స్థాయి విద్యార్థులలో వైజ్ఞానిక సాంకేతిక అంశాలపై ఆసక్తిని పెంచడం, విద్యార్థులలో సృజనాత్మకత ఆలోచనలు పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "ఇన్స్పైర్ మానక్" అవార్డు లను అందజేస్తుందని, విద్యార్థుల ఆలోచన లకు ఇది ఒక వేదికగా వుంటుందని, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో ఇన్స్పైర్ మానక్ కు సంబంధించిన ప్రచార గోడ పత్రులను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదివే 6 -10వ తరగతి విద్యార్థుల నుంచి తప్పనిసరిగా ఐదు నామినేషన్లు పంపించి, విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యేలా ఆయా పాఠ శాల ప్రధానోపాధ్యాయులు, గణిత, సైన్స్ ఉపాధ్యాయులు ప్రోత్సాహిం చాలన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం 2024-25 సంవత్స రానికి గాను, "ఇన్స్పైర్ మానక్" అవార్డులకు జిల్లాలోని విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు, విద్యార్థులు తమ సృజనాత్మకమైన ప్రాజెక్టులను ఆన్లైన్లో నమోదుచేయడానికి గాను ప్రతి పాఠశాలలో ఒక ఐడియా బాక్స్ కచ్చితంగా ఏర్పాటుచేసి విద్యార్థుల యొక్క ఆలోచన ఆధారంగా, వాటిలో ఐదు అత్యున్నతమైన ప్రాజెక్టు ఆలోచనలు ఎంపికచేసి సెప్టెంబర్ 15 తేదీ వరకు విద్యార్థుల ప్రాజెక్ట్ వివరాలను www.inspireawards-dst-gov.in వెబ్సైట్లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న తమ పాఠశాల లాగిన్ ద్వారా గడువు తేదీలోపు (15సెప్టెంబర్, 2024) నమోదు చేయాలని ఆయన తెలిపారు. అవార్డుకు ఎంపికైన ప్రతి విద్యార్థి ప్రదర్శనలో తమ ప్రాజెక్టు తయారికిగాను పదివేల రూపాయలు పారితోషికం ఇవ్వడం జరుగుతుందని, అదేవిధంగా జాతీయస్థాయికి ఎంపిక అయినట్లయితే 20 వేల రూపాయల వరకు ప్రాజెక్టును మెరుగుపర్చుటకు కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ నిధులను కేటాయిస్తుందని కలెక్టర్ అన్నారు. ఇన్స్పైర్-మనాక్ అవార్డ్ ఆన్లైన్లో నమోదు చేసే విషయంలో సందేహాలు ఉంటే జిల్లా సైన్స్ అధికారి దుస్సా జగదీశ్వర్ ను 9440354528 చరవాణి ద్వారా సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, జిల్లా సైన్స్ అధికారి జగదీశ్వర్, ఇన్స్పైర్-మనాక్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నోట్ పుస్తకాలు పెన్నులు పంపిణీ



కల్లూరు జూలై 25(జనం సాక్షి): కల్లూరు పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పదివేల విలువగల నోట్ పుస్తకాలు పెన్నులు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయు రాలు పొదిలి పద్మ చేతుల మీదగా గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భం గా ఏర్పాటుచేసిన సమావేశానిక ప్రధానోపాధ్యాయులు వాసిరెడ్డి నాగ పద్మ, అధ్యక్షత వహించారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు నున్న కృష్ణయ్య సహకారంతో కీర్తిశేషులు అంజిరెడ్డి,కోటేశ్వరమ్మ, జ్ఞాపకార్థం వారి కుమారులు మారెళ్ళ శ్రీనివాస్ రెడ్డి, కైలాష్ రెడ్డి, పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు నోటి పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు ,ఎరైజర్స్ , పఠన సామగ్రిని పదివేల రూపాయ లతో కొనుగోలు చేసి నున్న కృష్ణయ్య ద్వారా పాఠశాలకు అందజేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం, దాతలు, కల్పిస్తున్న సౌకర్యాలతో ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాము నాయక్, బి రాంబాబు, రమాదేవి, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మధిర మున్సిపాలిటీలో ఉన్న సమస్యలపై

# అధికారులు తక్షణమే స్పందించాలి..

**రోడ్లకు వెంటనే మరమ్మతులను నిర్వహించాలి..**

**సిపిఐ నాయకులు బెజవాడ రవి డిమాండ్..**



మధిర ఆర్.సి జులై 25. (జనంసాక్షి) మదిర మున్సిపాలిటీ పరిధిలోని అనేక వార్డులలో కనీసం నడవడానికి కూడా ఇబ్బంది పడేలావున్న రోడ్లకు గ్రావెల్ అయిన తోలి మరమ్మతులు నిర్వహించి ఇబ్బంది పడుతున్న ప్రజలకు రహదారి సౌకర్యం కల్పించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి బెజవాడ రవి మున్సిపల్ పాలక వర్గంను అధికారులను డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న సామెతకు సరిపోయేలా మధిర మున్సి పాలిటీ తయారైందని, కనీసం నడిచి వెళ్లే పరిస్థితి కూడా లేని రోడ్లు ఉన్నాయని, రోడ్లమీదకు వచ్చే మురుగు కాలువలు వల్ల పారిశుధ్యం సరిగా లేక దుర్వాసనతో కూడిన రహదారులు మధిరకు వచ్చే ప్రధాన రహదారివెంట మున్సిపాలిటీ వారు వేసే చెత్త, ఊరినిండా పందులు, మడుపల్లి,మధిరలో కోతులు, ఇలా మదిర మున్సిపాలిటీ పరిధిలో విలీనమైన అంబారుపేట, జిలుగుమాడు, ఇల్లిందల పాడు గ్రామాల పరిస్థితి దారుణంగా ఉందన్నారు.మధిరలో కూడా అటువంటి పరిస్థితే ఒదని విమర్శించారు. నూటికి నూరు శాతం ప్రజలను ముక్కు పిండి వసూలు చేసే ఇంటిపన్ను వసూళ్ల లో మాత్రం ముందుందని,మౌళిక వసతుల కల్పనలో ఎక్కడుందో పాలక వర్గం, అధికారులు ఆలోచించాలని కోరినారు. ఇప్పటికైనా మధిర మున్సిపాలిటీ పాలక వర్గం, అధికారులు ప్రజలు పడుతున్న భాదలను అర్థం చేసుకొని యుద్ధ ప్రాతి పదికన బురదమయమైకనీసం నడవ డానికి కూడా ఇబ్బందిగా వున్న రోడ్లకు గ్రావెల్‌ను తోలించి మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు రహదారి సౌకర్యం కల్పించాలని బెజవాడ రవి డిమాండ్ చేశారు.

# విద్యారంగాన్ని నిరాశపర్చిన రాష్ట్ర బడ్జెట్..




సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):
తెలంగాణ రాష్ట్ర విద్యారంగ అభివృద్ధి కోసం కేంద్రీకరిస్తామని మాటలు చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం నేడు కేవలం 7.3శాతం నిధులు మాత్రమే కేటాయించడం ఎంత వరకు సమంజసమని పిడిఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామల ఆజాద్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ లు విమర్శించారు.గురువారం జిల్లా కేంద్రంలోని అరవై ఫీట్ల రోడ్ లో రాష్ట్ర బడ్జెట్ లో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడంను నిరసిస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగం పైనే కేంద్రీకరిస్తామని మాటలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆచారాణత్మక బడ్జెట్ కేటాయింపులు చేయకపోవడం శోచనీయం అన్నారు.కేవలం రూ.21389 కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు.ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీల అమలు గురించి ఈ బడ్జెట్ లో ప్రస్తావనే లేదని అన్నారు.సంక్షేమ వసతి గృహాలకు, గురుకులాలకు సొంత భవనాలు, వాటి అభివృద్ధి పైన స్పష్టమైన వైఖరి వెల్లడించకపోవడం సరికాదన్నారు.విద్యార్థులకు గత ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీల అమలుపై ప్రస్తావన లేదన్నారు.స్కాలర్షిప్,ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు ప్రతి ఏడాది పెండింగ్ లేకుండా విడుదల చేస్తామని చెప్పలేదని, పైగా పెండింగ్ నిధులు విడుదల పైన ఊసే లేదన్నారు. యూనివర్సిటీ అభివృద్ధి పైన సమగ్రమైన ప్రణాళిక రూపొందించలేదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విజయ్ రెడ్డి, తరుణ్, అరుణ్, ప్రసాద్, లక్ష్మణ్, ఆంజనేయులు, రాము తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి మున్సిపాలిటీల్లో ఇంటింటి జ్వర సర్వే..

## పారిశుధ్యంపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలి..



దేవరకొండ జనం సాక్షి జులై 25
జులై 26 నుండి దేవరకొండ మున్సిపాలిటీ లో ఇంటింటి జ్వర సర్వే నిర్వ హించాలని, నల్లగొండ కలెక్టర్ సి.నారాయణరెడ్డి మున్సిపల్, వైద్యా రోగ్యశాఖ సిబ్బందిని ఆదేశించారని, దేవరకొండ మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డి. ఎం అండ్ హెచ్ ఓ డా. కేస రవి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జులై 26 నుండి మెప్మా మరియు హెల్త్ డిపార్ట్మెంట్ వారితో ఇంటింటి ఫీవర్ సర్వే చేయనున్నట్లు, అదేవిధంగా కేస్ స్టడీ మొత్తం వివరాలు తీసుకోవాలని, ప్రతి ఇంటికి వెళ్ళినప్పుడు ఇంట్లో నీరు నిల్వ ఉండే డబ్బాలు, పూల కుండీలు, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని అన్నారు. నీటి నిల్వలోనే డెంగ్యూ దోమలు గుడ్లు పెట్టడం, గుడ్డు లార్వా దశలోకి వచ్చే వరకు నీటిలోనే ఉంటుందని తెలిపారు. ఈ దోమల వలన జ్వరాలు వస్తాయని, రాకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ఇట్టి సమావేశం లో హెల్త్ డిపార్ట్మెంట్ డా. అతియా అంజుమ్, డా. కీర్తి శ్రీ, నరహరి, ఖలీం, లింగయ్య, మెప్మా టి. ఎమ్. సి. జగమంతు, ఆర్ పి లు, ఆశా వర్కర్స్, ఏ ఎన్ ఎమ్ లు, మునిసిపల్ రవికుమార్, రమాకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

# గేదె బీభత్సం పలువురికి గాయాలు



టేకులపల్లి,జూలై 25 (జనం సాక్షి):
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని ఏ కాలనీ తండా సమీపాన స్మశాన వాటిక దగ్గర ఒక గేదె భయభ్రాంతులకు గురి చేస్తూ కొమ్ములతో బీభత్సం సృష్టించడంతో పలువురిని గాయపరిచిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా 108 కు వెంటనే సమాచారం ఇవ్వడంతో హుటా హుటిన 108 వాహనం చేరుకొని ఈ ఎంటీ రాధ, పైలట్ వెంకట రామారావు ప్రథమ చికిత్స అందించి కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గేదెకు ఇదివరకు కుక్క కరిచి ఉండడంతో పిచ్చి లేసి ఉంటుందని, దీంతో కనిపించిన ప్రతి వారి మీదికి దూసుకుపోతూ కొమ్ములతో బీభత్సం చేయడంతో ఏ కాలనీ తండాకి చెందిన దారావత్ లక్ష్మ(66) ముక్కుకు తీవ్ర గాయం కాగా, చందు(36) ఎడమచేయి విరిగింది. మరికొందరికి స్వల్ప గాయాలు అయ్యాయి. గ్రామస్తులంతా కలిసి ట్రాక్టర్ సాయంతో తాళ్లతో బంధించారు. గేదెను గుర్తించాల్సి ఉంది. గేద బీభత్సం సృష్టించి గాయపరచడంతో బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.



# ప్రజల సమస్యల పరిష్కారం కోసమే

## ప్రజావాణి ఎంపిడిఓ రాంరెడ్డి

కొండమల్లేపల్లి జులై 25 జనంసాక్షి :
జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రతి గురువారం ప్రతి గ్రామ పంచాయతీలలో నిర్వహించే ప్రజావాణి ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కారం అవుతున్నాయని కొండమల్లేపల్లి గ్రామ స్పెషల్ ఆఫీసర్, ఎంపిడివో రాంరెడ్డి తెలిపారు గురువారం కొండమల్లేపల్లి గ్రామ పంచాయతీలో ప్రజావాణిలో ప్రజల వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించారు ప్రజల సమస్యలు ఏమైనా ఉంటే ప్రజావాణిలో దరఖాస్తు ద్వారా పరిష్కరించుకోవచ్చని వారు సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపివో నర్సింహారావు, ఈవో వీరబాబు, టీచర్లు శోభ, మాణిక్యమ్మ, హెల్త్ అసిస్టెంట్ రవి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఫీవర్ సర్వే తో పాటు లార్వా సర్వే కూడా చేయాలి

## జిల్లా మలేరియా అధికారి గంగప్ప



నల్గొండ ఆర్సి, జులై 25(జనంసాక్షి)
ఆర్పిలు, ఆశ వర్కర్లు ఫీవర్ సర్వే తో పాటు లార్వా సర్వే కూడా చేయాలని జిల్లా మలేరియా అధికారి గంగప్ప కోరారు. గురువారం నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో ఫీవర్ సర్వే పై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీవర్ సర్వే చేసిన ఇళ్ళలో జ్వరంతో బాధపడే వ్యక్తులు ఉన్నట్లైతే వారి వివరాలు సేకరించి మరుసటి రోజు వారి గురించిన వివరాలు మరల కనుక్కోవాలి అని పేర్కొన్నారు. లార్వా నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి వెంటనే వాటిని శుభ్రపరచాలని సిబ్బందికి సూచించారు. రోజు సర్వేచేసిన 50 ఇళ్ళకు సంబందించిన వివరాలు నోట్ చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ ముసబ్ అహ్మద్ మట్లాడుతూ నేటి నుండి 48 వార్డులలో ఆర్పిలు, ఆశ వర్కర్లు కలిసి ఫీవర్ సర్వే, లార్వ సర్వే చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్లు, మెడికల్ సూపర్వైజర్లు, మెప్మా సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి ఎక్కడ

## సరితా నగేష్

## మాజీ ఎంపీటీసీ నామాపురం



మర్రిగూడ, జూలై 25, జనం సాక్షి:
మహాలక్ష్మి పథకం ఎక్కడ? నెలకు 2500 రూపాయలు నగదు బదిలీ ఎక్కడ? సరిత నగేష్ మాజీ ఎంపిటిసి మాట్లాడుతూ ఈ పథకం ఎక్కడ అని ప్రశ్నించారు,తెలంగాణ 2024-2025 బడ్జెట్ చూసినట్లు అయితే మహిళా సోదరీమణులు అవమానపరిచే విదంగా ఉన్నది, కాంగ్రెస్ ప్రభుత్వం ఎలక్షన్ లో ఆరు గ్యారెంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద ప్రతి 18 సంత్సరాలు నిండిన మహిళకు 2500 రూపాయలు ఇస్తామన్నారు కానీ మహాలక్ష్మి పతకం గురించి బడ్జెట్ లో మహిళల ఊసే లేదు కాబట్టి తక్షణమే మహాలక్ష్మి ఎప్పుడు ప్రకటిస్తారో దాని విధివిధానాలు చెప్పాలని నామాపురం ఎంపీటీసీ సరితా నగేష్ డిమాండ్ చేసారు.మహాలక్ష్మి పథకం కింద 25 వందల సహాయాన్ని అందిస్తామని చెప్పిన ప్రభుత్వం మాట మార్చింది... మహిళల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలను అమలు తమన్న ప్రభుత్వంపై నమ్మకం లేదు.. కాలం వెలదీసే మాటనే తప్ప ఆచరణ కనిపించడం లేదు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధి ఉంటే మహిళల కు ఇచ్చిన ప్రతి హామీలు నిలబెట్టుకోవాలి.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటన చేయాలి

### టి యు ఎఫ్ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులుఎస్ కె చాంద్



రామన్నపేట, జులై 25 (జనంసాక్షి)
రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటన చేయాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ కె చాందు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేకమంది త్యాగాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తే గత ప్రభుత్వం ఉద్యమకారుల ఊసే ఎత్త లేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తిస్తామని చెప్పి ఆరు గ్యారెంటీలలో చెప్పినట్లుగానే వెంటనే గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. అర్హులైన వారందరికీ గుర్తింపు కార్డులు, 250 గజాల ఇంటి స్థలం,25 వేల రూపాయల పెన్షన్ మిగతా రాయితులు ఇవ్వాలన్నారు. జార?ండ్ రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లుగానే తెలంగాణలో కూడా వీలైనంత త్వరగా అమలు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు నోముల శంకర్, బొడ్డుపల్లి లింగయ్య, రాములు, ఎండి ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

## గుంతలు గుంతలు గుంతలుగా మారిన జెబి రోడ్డు పట్టించుకోని అధికారులు



కొండమల్లేపల్లి జులై 25 జనంసాక్షి :
చినుకు పడితే పట్టణాల్లో రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి రోడ్లు బురదమయంగా మారుతుండడంతో పాదాచరులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు పట్టణాల్లో వానొస్తే నడిచే పరిస్థితి లేకుండా పోయింది కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలో జేబి రోడ్డులో ప్రముఖులు నివాసం ఉంటున్నారు జెబి వెళ్లే దారిలోనే మండల ప్రజాపరిషత్ కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయం, పదవతరగతి హై స్కూల్, వైన్స్ షాప్, దేవరకొండ బైపాస్, గాజీ నగర్, చింతచెట్టు తండా గ్రామాలకు వెళ్లే దారి కావడంతో నిత్యం వాహనదారులు రద్దీగా ఉంటారు రోడ్డు గుంతలు పడి రాకపోకలకు కూడా అంతరాయం కలుగుతోంది రోడ్డుపై అప్పటికే గుంతలు పడి ఉండడంతో వర్షపు నీరు నిలవడంతో గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు జెబి దారిలోనే మిషన్ భగీరథ మంచినీళ్ల పైపులైన్ వాహనాల రాకపోకల రద్దీతో పగిలి మంచినీళ్ల పైపులైన్ కలుషితమవుతున్న శాతవాహన నగర్ నివాసులు, జెబి నగర్ నివాసులు మిషన్ భగీరథ పైప్ లైన్ మరమ్మతులు చేసి జెబి రహదారికి మర మ్మతులు చేయాలని ఎన్నిసార్లు అధికారు లకు ఫిర్యాదులు చేసిన అధికారులు ఎవరూ పట్టించు కోకపోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నార మండల అధికారులు మిషన్ భగీరథ పైప్లైన్ పగిలిన రహదారి వెంటనే రాకపోకలు చేస్తున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో మరమ్మత్తులు చేయకపోవడంతో జేపీ దారి వెంట నివాసముంటున్న ప్రజలు జెబి దారి వెంట వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి లీక్ అవుతున్న మిషన్ భగీరథ పైప్ లైన్, జెబి రహదారిని వెంటనే మరమ్మత్తులు చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు

## ఉపాధ్యాయులుకు ఘనంగా వీడ్కోలు సన్మానం



చిట్యాల జూలై 25(జనం సాక్షి):
చిట్యాల మండలం గుండ్రంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు సన్మానం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. బదిలీ పదోన్నతి పై వెళ్లిన ఉపాధ్యాయులు కే శ్రీనివాస్, సంధ్యారాణి,ప్రసాద్ ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించి మెమెంటోలు అందజేయడం జరిగింది. అనంతరము మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి అనంతరము బదిలీపై వెళుతున్నందుకు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం అండాలు షరీఫ్ వెంకట్రావు రాంరెడ్డి వాలంటరీలు రేణుక రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ యువజన నాయకుడు జన్మదిన వేడుకలు

రామన్నపేట, జులై 25 (జనంసాక్షి)
పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ యువజన నాయకుడు నోముల ప్రవీణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక రహదారి బంగ్లాలో కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్ ను శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ నాసర్, కూనూరు కృష్ణ, మహమ్మద్ అక్రమ్, సాల్వేర్ లింగం, మొహమ్మద్ మహబూబ్ అలీ, కొమ్ము శేఖర్, లెక్కల ప్రవీణ్, గోదాసు శీను, లవణం సాయి, సాల్వేర్ ప్రవీణ్, నోముల చిరంజీవి, మహమ్మద్ రిజ్వాన్, శ్రీకాంత్, మనీ, సైదులు, అరుణ్, మేడి ధ్రువ, పబ్బు శివ, వేణు, నరేష్, కేశవ సాయి తదితరులు పాల్గొన్నారు.



## నమ్మకమే బ్యాంకుల అభివృద్ధికి మూలం

### కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర




ఖమ్మం టౌన్, జూలై 25(జనంసాక్షి)
బ్యాంకింగ్ రంగంలో రాణించాలంటే కస్టమర్లకు సరైన సమయంలో సహాయ సహకారాలు అందించాలని కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర అన్నారు. గురువారం కెనరా బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వారోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లా డుతూ చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా మన బ్యాంకుపై నమ్మకం తో వచ్చిన ప్రతి కస్టమర్ మనకి దేవుడు లాంటి వారని, వారి మన్నలను మనం పొందిన నాడే బ్యాంకు పురోభివృద్ధికి అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.ఏజీఎం మాధవి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత ఖమ్మం అత్యంత పెద్ద నగరం అని ఇక్కడ వ్యాపారులు కానీ, కార్మికులు కానీ, రైతులు కానీ చాలా నమ్మకంతో బ్యాంకులకు వస్తారన్నారు. తాను వారంలో ఒక రోజైనా ఈ బ్యాంకుకు వస్తానని ఇక్కడ సిబ్బంది ఖాతాదారులతో ఎంతో మెలకువగా ఉంటారని, ఖాతా దారులు సైతం ఈ బ్యాంకు తమ బ్యాంకు అనే విధంగా సిబ్బంది ప్రవర్తిస్తారని అన్నారు. కార్యక్రమంకు ముందు కొన్ని దశాబ్దాలుగా బ్యాంకులో ఖాతాను ప్రారంభించి నేటి వరకు ఎన్ని బ్యాంకులు వచ్చినప్పటికీ ఇదే బ్యాంకులో కొనసాగుతూ ఉన్న అనేక మందికి గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్ సందర్భంగా సన్మాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ పడయ్య, హీరేమత్, సీనియర్ మేనేజర్లు రమ్యరెడ్డి, జి నాగేశ్వరరావు, విజయ చంద్, ఆర్ వెంకటేష్, మేనేజర్లు ఎర్రయ్య, బి రాజు, రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్లో తెలంగాణ పై మరోసారి వివక్ష చూపిన మోడీ సర్కార్

### - కేంద్ర ప్రభుత్వ వైఖరి సమైక్య స్ఫూర్తికి విఘాతం - మాజీ జెడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి



హుజూర్ నగర్, జూలై 25 (జనంసాక్షి):
కేంద్ర బడ్జెట్లో తెలంగాణ పై మరోసారి మోడీ సర్కార్ వివక్ష చూపించింది. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులతో కలిపి ఎనిమిది మంది ఎంపీలను గెలిపించిన మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తెలంగాణకు బడ్జెట్లో తీవ్ర అన్యాయం చేసిందని మాజీ జెడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం అమరవరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బిజెపి పార్టీలు పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు తమ తమ పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపిస్తే కేంద్రం నుండి మరిన్ని నిధులు తెచ్చి తెలంగాణను అభివృద్ధి చేస్తామని అబద్ధపు ప్రచారాలు చేసి, గెలిచి ఇప్పుడు రెండు పార్టీలు తెలంగాణ ప్రజలను మోసం చేశా యన్నారు. 2014 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి విభజన చట్టంలో పేర్కొన్న బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, వరంగల్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కు జాతీయ హోదా వంటి హామీలకు నిధులు మంజూరు చేయకుండా తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రాజకీయ అవసరాల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ , బీహార్ రాష్ట్రాలకు మాత్రమే బడ్జెట్లో ఎక్కువ నిధులు కేటాయించి మిగిలిన రాష్ట్రాల పట్ల వివక్ష చూపటం ద్వారా సమైక్య స్ఫూర్తికి విఘాతం కలుగుతుందన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంతో ఘర్షణా త్మకంగా వ్యవహరించడం ద్వారా రాష్ట్రా నికి నష్టం జరిగిందన్న రేవంత్ రెడ్డి ఇప్పు డు ఏం సమాధానం చెప్తాడని అన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం, కాంగ్రెస్ ఎంపీలు కేంద్ర ప్రభుత్వం పై పోరాటానికి సిద్ధం కావాలని ఉద్ఘాటించారు. ఇవాళ బిఆర్ఎస్ పార్టీ 10 మంది ఎంపీ లు గెలిచి ఉంటే కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కారు మెడలు వంచి తెలంగాణ ప్రయోజనాలు కాపాడేదన్నారు. ఇప్పటికైనా ఎప్పటికైనా స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు మేలు చేస్తుందని, బిఆర్ఎస్ పార్టీ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామ రక్షని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ నబి, మండల మాజీ సర్పంచులు గుజ్జుల సుజాతఅంజిరెడ్డి, రమ్యానాగరాజు,మండల పార్టీ ఉపాధ్యక్షులు ఉస్తేల చిన లింగారెడ్డి, మాజీ పిఏసిఎస్ చైర్మన్కామిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

## అందజేసిన లక్కినేని రమేష్



కల్లూరు జూలై 25(జనం సాక్షి)
కల్లూరు పట్టణ పరిధిలోని అంబేద్కర్ నగర్ కు చెందిన తలమాల పిచ్చయ్య (ఫ్రాంచెస్) అనే వ్యక్తి సుదీర్ఘకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ. ప్రతి నెల వైద్యానికి అయ్యే మందులు కొనుగోలుకు డబ్బులు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా డు. దీంతో స్థానిక నాయకులు ద్వారా సమాచారం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్కినేని రమేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి గురువారం పిచ్చియ స్వగృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య ,ఆర్థిక పరిస్థితులను ,యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు .తలమాల పిచ్చియ్య కుటుంబానికి ధైర్యం చెప్పి వైద్యానికి అయ్యే ఖర్చుల నిమిత్తం బాధితుడికి మూడు వేలు రూపాయలు.ఆర్థిక సహాయాన్ని అందించారు. బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితిని ,అనారోగ్య పరిస్థితిని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్ట దయానందు. దృష్టికి తీసుకెళ్లి ఆసరా పెన్షన్ వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లక్కినేని రమేష్ వెంట ఎంపీటీసీ దామల జ్యోతి,మాజీ ఎంపీటీసీ దామల రాజు,కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు ఉబ్బన శ్రీనివాసరావు, ఉబ్బన ఏసుబాబు,స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం..

**గత ప్రభుత్వ అనవాతీనే కోనసాగింపు..**

**జిల్లా వ్యాప్తంగా నిరసనలకు ఎస్ఎఫ్ఐ పిలుపు..**

**టి. ప్రవీణ్ జిల్లా కార్యదర్శి**



ఖమ్మం అర్బన్,జులై25(జనంసాక్షి)
తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం చేసిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.3% ఇది గత ఓటాన్ బడ్జెట్లో కేటాయించిన బడ్జెట్ కంటే తక్కువ.గత బడ్జెట్లో విద్యారంగానికి 21,389 కోట్ల రూపాయలు కేటాయించింది. అది ప్రస్తుతం 21,292కోట్లు కేటాయించారు. ఈ నిధులతో ప్రస్తుతం ప్రభుత్వ విద్య యే మాత్రం అభివృద్ధి కాదని ఎస్ఎఫ్ భావిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పెట్టినట్లు ప్రతి మండలంలో తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పినది.కానీ దాని ఊసు ఈ బడ్జెట్లో లేదు. ప్రతి రెండు గ్రామాలకు ఒక గురుకులం అని అన్నారు.దాని గురించి చర్చే లేదు. యూనివర్శిటీల అభివృద్ధి రాష్ట్రంలో 500 కోట్లతో ఎలా సాధ్యం అవుతుంది. వీటిలో ఉస్మానియా, మహిళా యూనివర్సిటీ 200 కోట్లు పోనూ 300 కోట్లు పలహారం పంచినట్లు పంచారు. యూనివర్శిటీల నిర్వహణ మినహా అభివృద్ధికి యూనివర్శిటీలు నోచుకోవు. ప్రజా ప్రభుత్వం ఎలా ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తుందో తెలపాలని ఎస్ఎఫ్ఐ ప్రశ్నిస్తుంది.రాష్ట్రంలో గత బిఆర్ఎస్ పాలనలో యూనివర్శిటీలు దెబ్బతిన్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మెస్,భవనాలు, ఖాళీల భర్తీ, మౌళిక సదుపాయాలు కల్పిస్తామని ప్రతి యూనివర్శిటీకి అభివృద్ధికి నిధులు ఇస్తామని చెప్పారు. ఉస్మానియా కు 1000కోట్లు,మహిళ యూనివర్శిటీఅభివృద్ధి కోసం. 500 కోట్లు నిధులు నిర్వహణ, బాసర ఐఐఐటి అభివృద్ధి, అలాగే ఖమ్మం, జిల్లా కేంద్రాలలో నూతన యూనివర్శిటీ కోసం కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ యూనివర్శిటీలు అభివృద్ధి కోసం 500కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుంది. రాష్ట్రంలో ఉన్న 11 రాష్ట్ర యూనివర్శిటీ లకు కనీసం నిర్వహణకు కూడా నిధులు రావు. ఒక్క ఉస్మానియా యూనిర్శిటీకే 350 కోట్లు పైగా నిర్వహణకు అవసరం. కాకతీయ, మహాత్మాగాంధీ, తెలంగాణ, శాతవాహన, జెఎన్టీయుహెచ్, ఫైన్ ఆర్ట్స్, మహిళా యూనివర్శిటీ, అగ్రికల్చర్ యూనివర్శిటీ, వెటర్నరీ, హర్టీకల్చర్ లాంటి వాటికి నిధులు కేటాయింపులు లేవు. తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ప్రకారం బాసర ఐఐఐటిల లాగా మరో రెండు కేటాయిస్తామని చెప్పి వాటి గురించి కూడా ప్రస్థావన లేదు.పాఠశాల విద్యారంగ లో ఖాళీలు భర్తీ ,మధ్యాహ్న భోజనం నిధులు, ఏకోపాధ్యాయ పాఠశాలలు, నూతన భవనాలు, లైబ్రరీ, ముత్రశాలలు, మౌళిక సదుపాయాలు కోసం ఈ నిధులు సరిపోవని ఎస్ఎఫ్ ఐ భావిస్తోంది. గురుకులాలు నిర్మాణం కోసం కూడా కనీస నిధులు లేవు ఇప్పటికే రాష్ట్రంలో 800 పైగా గురుకులాలకు స్వంత భవనాలు లేవని, ఉన్న గురుకులాలు కూడా సరైన మౌళిక సదుపాయాలు లేవు. ఈబడ్జెట్లో గత ఆరేళ్ళ నుండి పెండింగ్ ఉన్న స్కాలర్ షిప్స్ మరియు ఫీజు రీయంబర్స్ మెంట్స్ 7 వేల కోట్ల పైగా పెండింగ్ లో ఉన్నాయి. వాటికి విడుదల కోసం నిధులు కేటాయించలేదు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటన చేసిన స్పష్టమైన నిధులు లేవు. అందుకే ఈ ప్రభుత్వం గత ప్రభుత్వం లాగా కాకుండా 15 % పైగా నిధులు విద్యారంగానికి కేటాయిస్తామని చెప్పి 7.3% నిధులు మాత్రమే కేటాయించారు. విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి నియోజకవర్గానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల హామీ కూడా ఎలాంటి చర్చ లేదు. తక్షణమే బడ్జెట్ సవరించి విద్యారంగానికినిధులను పెంచి ప్రభుత్వ విద్యారంగాని అభివృద్ధి చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోంది. ఈ కేటాయింపులు నిరసనగా జిల్లా వ్యాప్తంగా నిరసనలు పిలుపునిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ తెలిపారు.

# ఖమ్మం గట్టయ్యా సెంటర్లోవన మహోత్సవం

ఖమ్మం అర్బన్,జులై25(జనంసాక్షి)



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం- 75 లో భాగంగా గురువారం ఉదయం 53వ డివిజన్ గట్టయ్య సెంటర్ లోని శ్రీనిలయం అపార్ట్మెంట్ ముందు అపార్ట్మెంట్ కమిటీ సభ్యులు ఏర్పాటుచేసిన వన మహోత్సవం కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మొక్కలను విరివిగా పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని అన్నారు. మానవాళి కావాల్సిన ఆక్సిజన్ మొక్కల నుండే లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ వీలైనన్ని మొక్కలను నాటి భవిష్యత్తు తరాలకు బంగారు బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కడవెండి వేణుగోపాల్, సత్యనారాయణ, నన్నెబోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# జోనల్ స్థాయి పాఠశాలల క్రీడల నిర్వహణపై సమీక్ష సమావేశం

కల్లూరు జూలై 25(జనం సాక్షి)
తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల క్రీడల సమైక్య ఆధ్వర్యంలో మండల, జోనల్ స్థాయి క్రీడా పోటీల నిర్వహణపై కల్లూరు గవర్నమెంట్ హై స్కూల్లో సత్తుపల్లి జోన్ స్థాయి కల్లూరు, పెనుపల్లి, సత్తుపల్లి వేంసూరు మండలాలకు చెందిన పాఠశాల హెచ్ ఎం లు, ఎంఈఓ లు, ఫిజికల్ డైరెక్టర్ లు, వ్యాయామ ఉపాధ్యాయుల సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ, మండల స్థాయి, జోనల్ స్థాయి క్రీడా పోటీల నిర్వహణ తేదీల నిర్ణయంపై సమీక్షించారు. ఆగస్టు 31వ తేదీ లోపు మండల స్థాయి క్రీడా పోటీలు పూర్తి చేయాలని, అదేవిధంగా సెప్టెంబర్ 10 ,11 తేదీలలో జోనల్ స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది. జోనల్ స్థాయి పాఠశాలల క్రీడా పోటీల నిర్వహణ తోపుడు బండి ఫౌండేషన్ చైర్మన్ షేక్ సాదిక్ అలీ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు తెలిపారు. జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు తోపుడు బండి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి, ట్రోఫీస్ మెడల్స్, తోపుడు బండి ఫౌండేషన్ నుంచి అందించనున్నట్లు. చైర్మన్ సాదిక్ అలీ తెలిపారు. జాతీయస్థాయిలో రాణించేటటువంటి క్రీడాకారులకు ప్రోత్సాహకాలు కూడా అందించడం జరుగుతుంది పేర్కొన్నారు . జోనల్ స్థాయి క్రీడ నిర్వహణకు సంబంధించి పూర్తి బాధ్యతను తీసుకొని క్రీడాకారులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన తోపుడుబండి ఫౌండేషన్ చైర్మన్ సాదిక్ అలీని సత్తుపల్లి జోన్ వ్యాయామ ఉపాధ్యాయులు వ్యాయామ దర్శకులు ప్రత్యేక కృతజ్ఞతలు అభివందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రత్తిపాటి నివేదిత ఎంఈఓ దామోదర ప్రసాద్ ,హెడ్మాస్టర్ బొంతు శ్రీనివాసరావు ,పి పవన్ కుమార్ బట్టు రామ్మూర్తి , చిన్న బాబు, ఫిజికల్ డైరెక్టర్ సీనియర్ పిడి బీమా సమావేశ కోఆర్డినేటర్ పసుపులేటి వీర రాఘవయ్య సత్తుపల్లి జోన్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ సంతాప సభను జయప్రదం చేయాలి

ఖమ్మం అర్బన్,జులై25(జనంసాక్షి)
జులై 28న ఆదివారం ఉదయం ఖమ్మంలో, ఎస్ ఆర్ గార్డెన్స్ లో జరిగే,సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, కేంద్ర కమిటీ సభ్యులు,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఏ ఐ పి కె ఎం ఎస్ రాష్ట్ర అధ్యక్షులు అయిన, కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ సంతాప సభ ను జయప్రదం చేయాలని, రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో పోస్టరావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ ఐదుదశాబ్దాల విప్లవ జీవితం, ఆటుపోట్ల మధ్య సిద్ధాంత వైరుధ్యాల మధ్య రాటు తేలిన మనిషిని ఎన్నో నిర్బంధాలను బెదిరింపులను ఎన్కౌంటర్లను జైలను ధిక్కరించి ఉద్యమ ఎర్రజెండాను భుజాన మోసిన విప్లవోద్యమ నాయకుడన్నారు. ప్రజా ప్రతిఘటన వారు ఇల్లందు ప్రాంత ఉద్యమనే దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్న రోజుల్లో, 1996 జూన్ 21న కామ్రేడ్ ఎల్లన్న ఎన్కౌంటర్లో మరణించిన తర్వాత పార్టీ నిర్ణయం, అవసరాలు ఏజెన్సీ దళాలకు పొలిటికల్ లీడర్గా కామ్రేడ్ చంద్రశేఖర్ ఉండాలని పార్టీ నిర్ణయించిన దానికి కట్టుబడి2009వరకు ఆ బాధ్యతలు నిర్వహించాడన్నారు. ఆయన మరణించేవరకు నమ్మిన ప్రజాపన్న రాజకీయాల వెనుక దృఢంగా నిలబడ్డాడని అతివాద అవకాశవాద ధోరణులను తీవ్రంగా వ్యతిరేకించారనన్నారు. కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ 50 ఏళ్ల జీవితం ఎంతో గొప్పదని, ఆచరణీయమైనదని, అనుసరణీయమైనదని,పార్టీకి కట్టుబడి నిబద్ధతగా పనిచేయటం అమోఘమైనదని, రాజకీయంగా సిద్ధాంత పరంగా సరైన ప్రజాపంథా కోసం నిలబడ్డతీరు ఆచరణీయమైనదని ఆయన అన్నారు. 50 ఏళ్ల పాటు ఎన్నో ఆటుపోట్లను దాడులను విమర్శలను వేధింపులను ఎదుర్కొని తట్టుకొని ధైర్యంగా నిలబడినాడని ఆయనన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులుఆవుల అశోక్, సీవైపుల్లయ్య, జిల్లా నాయకులు సిహెచ్ శిరోమణి ఆవుల మంగతాయి,బందెల వెంకయ్య,పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి టీ ఝాన్సీ, డివిజన్ నాయకులు కేలోత్ లక్ష్మణ్, మందా సురేష్, పి వై ఎల్ నాయకులు మక్కా రవీందర్, జి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగుల సమస్యలు అడిగితే అక్రమ అరెస్టులా ?...



చింతపల్లి జూలై 25(జనం సాక్షి)
రాష్ట్రంలోని నిరుద్యోగులు, సమస్యలు పరిష్కరించాలని బీజేవైఎం అదేశాల మేరకు గురువారం అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న నాయకులను పోలీసులు ముందస్తు అక్రమ అరెస్టు చేశారు..ఈ.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యల పరిష్కరిస్తాము నిరుద్యోగ భృతి అనిపిస్తుంది జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని నమ్మబలికి ఉచిత హామీల పేరుతో యువతను ఇటు తెలంగాణ ప్రజలను మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి గుర్తుంచుకో తెలంగాణ గడ్డ పోరాటాల గడ్డ పోరాటాలను అక్రమ అరెస్టులతోటి నిలువరించాలనే మూర?పు ఆలోచన అరిచేతు తో సూర్యుని ఆపడం లాంటిదే తెలంగాణలో నిరుద్యోగులకు న్యాయం చేసే వరకు న్యాయం జరిగే వరకు భారతీయ జనతా పార్టీ యువ మోర్చా నిరుద్యోగుల పక్షాన పోరాటానికి సిద్ధమని తెలిపారు అరెస్ట్ అయిన వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేనమోని రాములు, మండల అధ్యక్షులు శివర్ల రమేష్ యాదవ్ ,జిల్లా కార్యవర్గ సభ్యులు సముద్రాల నగేష్, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేష్ , గజ్జె అభినవ్ , కుందేళ్ళ శ్రీశైలం , ముగిలమోని మల్లేష్, ముగిలమోని రవి, పాలకుల రాజు, గడ్డి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



# రైతుల రుణ విముక్తి కోసం కృషి చేస్తా..

**- డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు**

చంద్రుగొండ జులై 25 (జనంసాక్షి):
రుణమాఫీ కానీ రైతులను రుణ విముక్తులను చేసేందుకు కృషి చేస్తానని, ఆ దిశగా రాష్ట్ర మంత్రి తుమ్మల, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ల దృష్టికి సమస్యను తీసుకెళ్తానని డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. గురువారం స్థానిక డిసిసిబి బ్రాంచ్ ను సందర్శించారు. ఈ సందర్భంగా గానుగపాడు సొసైటీ చైర్మన్, గుంపెన సొసైటీ చైర్మన్, చంద్రరావు, సుధాకర్ రావు లు పహానిల ద్వారా రుణాలు పొందిన రైతులను పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని వినతిని అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిసిసిబి చైర్మన్ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా డిసిసిబి పరిధిలో ఇప్పటివరకు 37,625 మంది రైతులకు రూ.121. 63 కోట్ల రుణమాఫీ అయిందన్నారు. 1.69,864 మంది రైతులు రూ. 908. 27 కోట్ల రుణాలు పొందాలని వీరందరికీ రుణమాఫీ కావాల్సి ఉందన్నారు. అనంతరం గానుగపాడు గుంపెన సొసైటీ చైర్మన్లు డిసిసిబి చైర్మన్ ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నల్లమోతు వెంకటనారాయణ, దారా బాబు, మేడ మోహన్ రావు, డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ ప్రసన్న, గానుగపాడు సొసైటీ సీఈవో లంక నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## తుంగతుర్తి ఎక్సైజ్ శాఖ పరిధిలో నేడే వాహనాల వేలం...

తుంగతుర్తి జులై 25 (జనం సాక్షి)
తుంగతుర్తి ఎక్సైజ్ శాఖ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు నేడు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ప్రోహిబిషన్ ఎక్సైజ్ సీఐ రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో జిల్లా ప్రోహిబిషన్ ఎక్సైజ్ అధికారి సమక్షంలో ఉదయం 10 గంటలకు తుంగతుర్తి ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేలం లో టీవీఎస్ ఎక్సెల్ . బజాజ్. సిడి హండ్రెడ్. బజాజ్ డిస్కవర్. మాస్ట్రో ఎడ్జ్. ద్విచక్ర వాహనాలను వేలం పాటలు ఉంచినట్లు ఆసక్తిగల వారు ఈ వేలంలో ధరావత్ చెల్లించి వాహనాలను తనిఖీ చేసుకొని పాల్గొనాలని కోరారు.

## అనుమతి లేకుండా నడుస్తున్న హాస్పిటల్స్ సీజ్




నేరేడుచర్ల, జులై 25( జనంసాక్షి) :
ఎటువంటి డాక్టర్స్ లేకుండా,ఫార్మసిస్ట్ లు, ల్యాబ్ టెక్నీషియన్ లేకుండా హాస్పటల్స్ నడిపిస్తూ ఇన్ పేషంట్ లకు ట్రీట్ మెంట్ అందిస్తున్నందున నేరేడుచర్ల మండల కేంద్రంలోని అమ్మ హాస్పిటల్,శ్రీ సాయి శ్రీనివాస హాస్పిటల్సని జిల్లా కలెక్టర్,డి హెచ్ ఎం వో.డాక్టర్ .కోటాచలం ల ఆదేశానుసారం సీజ్ చేశామని నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యధికారిణి పి. నాగిని తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు , అనుమతులు లేకుండా నడుస్తున్న హాస్పటల్ ల రిజిస్ట్రేషన్ గురించి,ఫార్మసీ,ల్యాబ్ టెక్నీషియన్ ,డ్యూటీ డాక్టర్స్ గురించి అడిగి పర్యవేక్షణ చేయటం జరిగిందని,అన్ని హాస్పటల్ నియమ నిబంధనలు పాటించి నడిపించాలని,ఎటువంటి అనుమతి లేకుండా హాస్పటల్ ను నడిపితే మూసివేయమని జిల్లా కలెక్టర్ మరియు, డీహెచ్ఎంవో ఆదేశానుసారం సీజ్ చెయ్యడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో సి హెచ్ వో శ్రీనివాస్ ,హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, పాల్గొన్నారు.

## నిషేధిత గుట్కా పాకెట్లు పట్టివేత



మేళ్లచెరువు
(జనంసాక్షి న్యూస్)
రాష్ట్ర ప్రభుత్వం నిషేదించిన గుట్కా పాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పి పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందినకలిదిండి నరసింహ రావు, చిన్నపంగు సుధాకర్ లకు చెందిన కిరాణా షాపులను తనిఖీ చేయగా భారీ మొత్తంలో గుట్కా పాకెట్లు దొరినట్లు అయన తెలిపారు. నిషేధిత గుట్కా అమ్ముతున్న కారణంగా పైన పేర్కొన్న ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## మృతురాలు కుటుంబానికి మంత్రి ఆర్థిక సహాయం

నల్లగొండ పట్టణంలోని గాంధీనగర్ 39 వార్డుకు చెందిన కొండ్రతి అంజమ్మ గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రోడ్లు %డ% భవనాలు, సినీమటోగ్రఫీ శాఖ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెంటనే స్పందించి తక్షణ సహాయం కింద పార్టీ శ్రేణుల ద్వారా గురువారం రూ.10 వేల సహాయం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కత్తుల కోటి, బోనగిరి ప్రభాకర్ ,బోడ ప్రభాకర్, సాయి ,ఆవుల వెంకన్న పాల్గొన్నారు.నల్గొండ మండలం పెద్ద సూరారం గ్రామంలో ముసుకు సుజన అనారోగ్యంతో మృతి చెందగా గురువారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.అనంతరం వారి కుమారులు సైదులు,రవిలను పరామర్శించి వారికి కాంగ్రెస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో దహన సంస్కారాల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందచేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిల్లి గిరి యాదవ్, మాజీ ఎంపీటీసీ పెండెం రత్నమాల పాండు, ఏడు దొడ్ల వెంకటరామిరెడ్డి, నరేష్ పటేల్, ప్రవీణ్, పురుషోత్తం,వెంకన్న, జానయ్య, యాదయ్య ,బిక్షం, లింగయ్య, యాదయ్య, వీరయ్య,కృష్ణయ్య ,ముత్తయ్య వెంకటయ్య వాసు,తదితరులు పాల్గొని వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

# వృత్తిదారుల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్

**చేనేత, మత్స్య రంగాల అభివృద్ధికి నిధులు పెంచాలి**




నల్గొండ ఆర్సి, జులై 25(జనంసాక్షి)
జూలై 23న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో వృత్తిదారుల సంక్షేమాన్ని విస్మరించిందని తెలంగాణ చేతి వృత్తిదారుల సమన్వయ సంఘం రాష్ట్ర నాయకులు బండా శ్రీశైలం, జిల్లా కన్వీనర్ గంజి మురళీధర్ ఆరోపించారు.గురువారం దొడ్డి కొమరయ్య భవన్లో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో చేనేత, మత్స్య పరిశ్రమల అభివృద్ధికి అతి తక్కువ నిధులు కేటాయించడం విచారకరమని అన్నారు. దేశంలో వ్యవసాయం తర్వాత రెండో ప్రధాన రంగమైన చేనేతకు చేయూతనిస్తామని బిజెపి ఎన్నికలకు ముందు బడ్జెట్లో 5000 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి నేడు అతి తక్కువ 200 కోట్లు కేటాయించడం విచారకరమని అన్నారు. గత ఏడాది 250 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ బడ్జెట్లో 50 కోట్లు తగ్గించారు. దేశవ్యాప్తంగా 1.83 కోట్ల జనాభా కలిగిన చేనేత కార్మికులకు పని లేక నేసిన వస్త్రాలు విక్రయం కాక అర్ధాకలితో అలమటిస్తూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత సంక్షేమ పథకాలు అంతంతమాత్రంగానే అమలవుతున్నాయని ప్రస్తుతం చేనేతకు 200 కోట్లు మాత్రమే కేటాయించడంతో కొత్త సంక్షేమ పథకాలు రాకపోగా గతంలో ఉన్న సంక్షేమ పథకాలకు కూడా మంగళం పాడే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం టెక్స్టైల్ రంగం కార్పోరేట్ రంగాలకు నిధులు పెంచి చేతి వృత్తిదారులను విస్మరించడం సిగ్గుచేటు అని అన్నారు బడ్జెట్లో ఉపాధి కనీస వేతనాల ఊసే లేదని అన్నారు. ఇచ్చిన బడ్జెట్ జీతభత్యాలకి సరిపోదని సంక్షేమం ఎలా చేపడతారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే బడ్జెట్ సవరణ చేసి చేనేత ఇతర వృత్తిదారుల సంక్షేమం కోసం 30 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో తెలంగాణ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా నాయకులు కొండ వెంకన్న, అవిశెట్టి శంకరయ్య, మురారి మోహన్, చెరుకు పెద్దలు, జేరిపోతుల ధనంజయ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## నిలిచిన 100పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు వెంటనే పునరుద్ధరించాలి

**తాటికొండ సీతయ్య.. బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు..**

**తుంగతుర్తి జులై 25 (జనంసాక్షి) :**
తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు నిధుల లేమితో ఆగిపోవడం విచారకరమని టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తాడికొండ సీతయ్య అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో గత టీఆర్ఎస్ ప్రభుత్వం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు కోసం 35 కోట్లు నిధులు విడుదల చేసి అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావుతో అప్పటి శాసనసభ్యుడు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ శంకుస్థాపన పనులు చేయించినట్లు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రస్తుత శాసనసభ్యుడు మందుల సామేలు ఎంతో ఆర్భాటంగా మళ్లీ శంకుస్థాపనలు చేశారని అన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి ఈ ప్రాంత ప్రజలకు వైద్య సదుపాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు ఈ సమావేశం లో జిల్లా నాయకులు గుండాగాని రాములుగౌడ్ .పట్టణ అధ్యక్షులు గోపగాని శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా యూత్ కాంగ్రెస్ నాయకుల జన్మదిన వేడుకలు

నల్గొండ ఆర్సి, జులై 25(జనంసాక్షి)



నల్లగొండ పట్టణ యువజన కాంగ్రెస్ నాయకులు కంచర్ల ఆనంద్ రెడ్డి, మంచికంటి సిద్దార్థ పుట్టినరోజు సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించిన పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుమ్ముల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, సీనియర్ నాయకులు మరియు యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవ కార్యక్రమంలో మొక్కల పంపిణీ

చిట్యాల జూలై 25(జనంసాక్షి):
చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన" వన మహోత్సవం" సందర్భంగా ఇంటింటికి ఆరు మొక్కల పంపిణీ కార్యక్రమాన్నికి మండల పంచాయతీ అధికారి బి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి జీవనాధారం పైన మొక్కలు ఆధారపడి ఉన్నాయని ప్రతి ఇంటికి ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఆయన కోరినారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సిద్ది వీర సోమయ్య, స్థానిక డాక్టర్ ఆర్ మాధవి,ఫీల్డ్ అసిస్టెంట్ మర్రి రమేష్,వసుకుల శంకర్,అంగన్వాడీ టీచర్స్,వి బి కే అనురాధ ,ఆశ వర్కర్స్ రైతులు కూలీలు తదితరులు పాల్గొనడం జరిగింది.




# వనరుల పరిరక్షణ ప్రాణావసరం

**సహజ వనరుల పరిరక్షణలో పౌర సమాజం**
**క్రియాశీలక పాత్ర నిర్వర్తించాల్సిన అవసరం ఉంది**
**రీజనల్ డైరెక్టర్ జి కృష్ణమూర్తి**



నల్గొండ ఆర్సి, జులై 25(జనంసాక్షి) :
మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం జియాలజీ విభాగం మరియు సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం లో రీజనల్ డైరెక్టర్ జి కృష్ణమూర్తి మరియు ఇతర శాస్త్రవేత్తలు వివిధ అంశాలపై ప్రసంగించారు. తన ప్రసంగంలో రీజనల్ డైరెక్టర్ శ్రీ జి కృష్ణమూర్తి మాట్లాడుతూ వనరుల పరిరక్షణకు భారత ప్రభుత్వం 1986 నుండి అనేక చట్టాలను రూప కల్పన చేసిందని, రాష్ట్రాలు సైతం అనేక చట్టాలను నిబంధనలను చేసుకున్నాయని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వాల్టా చట్టం అందులో భాగమేనని గుర్తు చేశారు. వనరుల పరిరక్షణకు అనేక వ్యవస్థలను సైతం ప్రభుత్వం రూప కల్పన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. భూగర్భ జలాల పై స్పృహ కలిగిన పౌర సమాజం చట్టాలపై అవగాహనతో క్రియాశీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా భూగర్భ జలాల గుర్తింపు మరియు నిర్వహణ, వర్షపాతాల విశ్లేషణ, భూగర్భ జలాల అంచనా, నాణ్యతా ప్రమాణాలు మరియు పునఃస్థాపన, ఫ్లోరోసిస్ మరియు భూగర్భ జలాల నియంత్రణ చట్టంపై శాస్త్రవేత్తలు ప్రసంగించారు. దక్కను పీఠభూమి ప్రాంతంలో ప్రధాన భాగమైన తెలంగాణ రాష్ట్రంలో సహజ సిద్ధమైన సవాళ్లతో పాటు మహానగరం హైదరాబాద్ వంటి జనసాంద్రత కలిగిన నగరాలు సహజ వనరులపై ఒత్తిడిని పెంచుతున్న విషయాన్ని గుర్తు చేశారు. వర్షపాత సరళిలో సైతం తెలంగాణ వ్యాప్తంగా భిన్న పరిస్థితులు ఉన్నట్టు తెలిపారు. నల్లగొండ జిల్లాలో వర్షపాత నమోదుకు అనేక కేంద్రాలు మరియు భూగర్భ జలాల పరిశీలనకు బోర్ వెల్ మరియు డిగ్ వెల్స్ ఏర్పాటును. అనంతరం భూగర్భ జలాల పరిశీలనకు అంచనాకు శాస్త్రీయ పద్ధతులను వివరించారు. ఎలక్ట్రో రెసిస్టివిటీ సోనోగ్రఫీ వంటి పద్ధతులను విశ్వాసంలోకి తీసుకోవాలని, తగు జాగ్రత్తలతో భూగర్భ జలాల అంచనా క్రమాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు జియాలజీ విభాగపు ప్రతినిధులు మాట్లాడుతూ రేపు విద్యార్థులతో క్షేత్రస్థాయిలో భూగర్భ జలాల పరిశీలన అంచనా ప్రయోగాలను చేయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విట్టల,సుధీర్ కుమార్, యాదయ్య, రాణి మొహంతా, రేష్మ, రాఘవేంద్ర, గౌతమ్, జియాలజీ విభాగం అధ్యాపకులు మధుసూదన్ రెడ్డి, ఆంజనేయులు, మచ్చేందర్, సుధాకర్, వెంకటేష్ తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కొండమల్లేపల్లిలో వర్గపోరు మీడియా కథనంపై

# తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన మాజీ ఎంపిపి

- సంపాదించుకోవడానికి రాజకీయాల్లోకి రాలేదని ప్రజల కోసమే కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేశామన్నారు
- మీడియాలో వచ్చిన కథనాలను తోసిపుచ్చిన మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి
- ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం మాజీ ఎంపిపి
- వ్యక్తిగత అనారోగ్య కారణాలవల్ల రుణమాఫీ సంబరాలకు రాలేకపోయాం మాజీ ఎంపిపి
- మీడియా పత్రికా రంగంలో ఉన్నవారు బాధ్యతగా వ్యవహరించాలి
- ఎమ్మెల్యే బాలు నాయక్ అడుగు జాడల్లో కాంగ్రెస్ శ్రేణులు అందరం కలిసి కట్టుగా పని చేస్తున్నాం
- కొండమల్లేపల్లి మండలంలో సమిష్టి కృషితో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేశాం
- ప్రజలకు సేవ చేయాలని ఉద్దేశంతోనే ప్రజాక్షేత్రంలో ఉన్నామన్నారు



**కొండమల్లేపల్లి జులై 25 జనంసాక్షి :**
కొండమల్లేపల్లి మండల కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు ఉన్నాయని ఒక మీడియా ఛానెల్ లో వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవమని అలాంటి మీడియా కథనాలను తీవ్రంగా ఖండిస్తున్నానని మాజీ ఎంపిపి దూదిపాల రేఖా శ్రీధర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు వ్యక్తిగత అనారోగ్య కారణాల వల్ల ఇటీవల జరిగినటువంటి రైతు రుణమాఫీ కార్యక్రమానికి హాజరు కాలేకపోయానని ఆ విషయం ఎమ్మెల్యే బాలు నాయక్ కూడ తెలుసునని తన భర్త దూదిపాల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు రుణమాఫీ విజయోత్సవ సంబరాల కార్యక్రమం దగ్గరుండి పర్యవేక్షించారని తమ అనుచరులు, మహిళలు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసారని తెలిపారు కానీ వాస్తవాలు తెలుసుకోకుండా ఒక మీడియా ఛానెల్ లో కాంగ్రెస్ పార్టీలోకి కొత్త వారు రావడం వల్ల, పాత వారికి మర్యాద ఇవ్వడం లేదు వర్గ పోరు నడుస్తుంది అనే అనవసరపు కథనాలు ప్రసారం చేసారని అందులో ఏ మాత్రం నిజం లేదు అని తెలిపారు కొండమల్లేపల్లి మండలంలో ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆధ్వర్యంలో పాత వారు కొత్త వారు అనే బేధం లేకుండా సమిష్టి కృషితో అందరిని కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని పార్టీ కార్యక్రమాలలో కలిసి ముందుకు పోతున్నామని అంతేకాకుండా మా కార్యకర్తలకు నాయకులకు అందరికీ అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన వేళలో అండగా ఉంటున్నామని, కొందరు మాపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని వాటిని ఉపేక్షించబోమని తెలిపారు. గత ఐదు సంవత్సరాలలో మేము ఎవరిని కూడా కించపరచలేదని రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవ చేశామన్నారు. కొండమల్లేపల్లి మండలంలో ప్రభుత్వ ప్రజా ఆస్తులను కాపాడామని కమిషన్ల కోసం కక్కుర్తి పడలేదన్నారు ఒక వ్యక్తిని విమర్శించేముందు ఆ వ్యక్తి గుణగణాలు తెలుసుకోవాలని హితవు పలికారు గతంలో కాంగ్రెస్ పార్టీ మూలన పడ్డా కూడా ఎంతో ఓపికతో గత బిఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఖండించి ఎంతో నీతి నిజాయితీగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేశామన్నారు కొండమల్లేపల్లి మండల కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు అనేది పూర్తిగా అవాస్తవమని కాంగ్రెస్ పార్టీలో అందరూ కలిసికట్టుగా ఎమ్మెల్యే బాలు నాయక్ ఎంపి కుందూరు రఘువీర్ రెడ్డి గెలుపు కోసం కృషి చేశామన్నారు భవిష్యత్తులో కూడా వర్గాలు ఉండబోవని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశానుసారం పార్టీ బలోపేతం కోసం అందరం సమిష్టిగా కలిసి ఉంటామని తెలిపారు ఇక ముందు ఎవరైనా ఇలాంటి అర్థరహితపు కథనాలు వార్తలు ప్రచురిస్తే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు.

# మొక్కలు భవిష్యత్తు తరాలకు జీవనాధారాలు..

**-జీవకోటి మనుగడ కోసం... హరిత వికాసం..జి ఎం దుర్గం రామచందర్**

**- మొక్కలు మన భూమికి ప్రాణవాయువు..**

**- మొక్కలు నాటండి వాటిని పరిరక్షించండి..**

మణుగూరు, జూలై 25 (జనంసాక్షి):
మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి భావిత రాల వారికి ఎంతో మేలు జరుగుతుందని సింగరేణి ప్రధాని అధికారి దుర్గం రామచందర్ అన్నారు. గురు వారం వృక్షారోపన్ అభియాన్ సందర్భంగా మణుగూరు మల్లెపల్లి ఉపరితల గని ఏరియాలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ బొగ్గు గనుల శాఖామాత్యులు కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు సింగరేణి చైర్మెన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం సూచనతో సింగరేణి అన్ని ఏరియాలలో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు.ఇచ్చిన ఆదేశంతో మణుగూరు ఏరియా ఎంఎన్‌జిఓసి పరిసర ప్రాంతాలలో మొక్కలు నాటారు. సకల జీవకోటి గతం, ప్రస్తుతం, భవిష్యత్తు హరిత వికాసంతో ముడిపడి ఉంది. చెట్లు ఎన్నో రకాలుగా మేలు చేసే మంచి నేస్తాలు. అవి అందించే అనేక రకాల సేవల్లో వాయు కాలుష్య నివారణ విరివిగా వర్షపాతాన్ని పెంచడం అతి ముఖ్యమైనవి. మనం పీల్చే గాలి కాలుష్యమైన కొద్ది మనం అనేక రకాల రుగ్మతల బారిన పడుతాము. అట్టి ప్రమాదము నుండి చెట్టు కాలుష్యభరిత వాయువును తాను పీల్చుకొని స్వచ్ఛమైన ప్రాణవాయువును మనకు అందిస్తుంది. ఇప్పటికే అధిక జనాభాతో భారీ ఎత్తున పట్టణీకరణ, పారిశ్రామికరణతో కాలుష్యం విపరీతంగా పెరిగిపోయి దేశ జనాభా అనేక రకాల వ్యాధులతో నానా అవస్తలు పడుతున్నారు. కాబట్టి కాలుష్యాన్ని హరించి స్వచ్ఛమైన ప్రాణ వాయువును పొందాలన్నా, విరివిగా వర్షాలు కురిసి త్రాగు నీటి, సాగు నీటి సమస్యలు తీరాలన్న ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక బాధ్యతగా విరివిగా మొక్కలు నాటి చెట్లను పెంచాలి. సింగరేణి యాజమాన్యం సామాజిక బాద్యత నిర్వాహణలో ఎప్పుడు ముందుంటుంది. ఆయా సందర్భాలను పట్టి అన్నీ ఏరియాలలో మొక్కలు నాటి వాటిని పరిరక్షించడంతో పాటు హరిత వికాసం యొక్క ఆవశ్యకత పట్ల సింగరేణియుల్లో, పరిసర గ్రామాల ప్రజలలో అనేక అవగాహన కార్యక్రమాలు చేబట్టడం జరుగుతుంది. ఇక ముందు కూడా సమాజ హితం కోరి సింగరేనియులకు మరియు స్థానికులకు పరిసర గ్రామాల ప్రజలకు విరివిగా ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తూ వారిలో అవగాహన పెంచే కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తామనీ తెలిపారు. ఈ కార్యక్రమం లో భాగంగా మణుగూరు ఏరియాలో మొత్తంగా 20,000 మొక్కలు నాటాలని అలాగే 5,000 మొక్కలు పంచాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగింది. ఈ నిరంతర ప్రక్రియలో భాగంగా నేడు మణుగూరు ఏరియా ఉపరితల గని ప్రాంతంలోని ఖాళీ ప్రదేశ%శీ% ఒకే రోజులో ఎంతో ఉత్సాహ భరిత వాతావరణంలో దాదాపు 1000 మొక్కలు నాటడం జరిగింది.
మా ఆహ్వానాన్ని మన్నించి ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయడంలో భాగస్వామ్యులైన మణుగూరు తహసిల్దార్ రాఘవ రెడ్డి , ఎంపీడీవో శ్రీనివాస్ రావు, ఎంపీఓ వెంకటేశ్వర్లు, కేఎల్‌పి మహాలక్ష్మి యాజ మాన్యానికి, కాంట్రాక్ట్ కార్మికులకు జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ ఇతర ఉన్నత అధికారుల చేతుల మీదుగా కాంట్రాక్ట్ కార్మికులకు సపోటా, అంజీర, మామిడి, తదితర ఫ్రూట్ బెరింగ్ మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఓ టు జి ఎం. శ్యామ్ సుందర్, ఏజిఎం (సివిల్) వెంకటేశ్వర్లు , ప్రాజెక్ట్ అధికారి కేపియూజి వీరభద్ర రావు , ప్రాజెక్ట్ అధికారి ఎంఎన్‌జిఓసి శ్రీనివాస చారి , డిజిఎం(ఐఈడి) కే వెంకట్ రావు , డిజిఎం(పర్సనల్) ఎస్ రమేశ్ , డిజిఎం( పర్చేస్) శ్రీనివాస మూర్తి, మెడికల్ సూపరింటెండెంట్ శేషగిరి రావు, డిజిఎం(ఫైనాన్స్) అనురాధ , ఏఐటియూసి యూనియన్ నాయకులు సాయి ప్రకాష్ , ఐఎన్‌టియూసి నాయకులు వి. కృష్ణం రాజు , సిఎంఓఏఐ అధ్యక్షుడు కే కృష్ణ మూర్తి , మణుగూరు ఓసి మేనేజర్ రాజేశ్వర రావు , సేఫ్టీ అధికారి భాస్కర్ రావు , డివైపిఎం పిబి అవినాష్ , పర్యావరణ అధికారి జే శ్రీనివాస రావు , ఈ ఈ (సివిల్) ప్రవీణ్ , ఐటి మేనేజర్ సాయిల సురేశ్ , ఇతర అధికారులు, ఫారెస్ట్ అధికారి కల్యాణ్, సింగరేణి ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.












## భక్తులకు మౌలిక వసతుల కల్పనకు శాశ్వత ప్రణాళికలు రూపొందించాలి :కలెక్టర్ సి.నారాయణరెడ్డి

ఆలయ అర్చకులు,దేవస్థానం కమిటీ జిల్లా కలెక్టర్ కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు,అభిషేకం నిర్వహించారు.అనంతరం దేవాలయ కార్యనిర్వహక అధికారి గదిలో జిల్లా కలెక్టర్ దేవాలయ అధికారులతో పాటు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ముఖ్యంగా చెరువుగట్టు పై ఉన్న శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర దేవాలయానికి ప్రతిరోజు,ప్రతి అమావాస్యకు,అదేవిధంగా ప్రతి సంవత్సరం నిర్వహించే జాతరకు లక్షలాది భక్తులు తరలివస్తారని ఆలయ అధికారులు తెలిపారు. వీరందరికీ సరిపోయే విధంగా రవాణా సౌకర్యం,తాగునీరు, టాయిలెట్లు,విద్యుత్తు వంటి సౌకర్యాలపై కలెక్టర్ ఆరా తీశారు.ప్రస్తుతం చెరువుగట్టు పైకి వెళ్లే రహదారులతోపాటు, ప్రస్తుతం ఉన్న టాయిలెట్ల సంఖ్య,తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం,రోడ్లు అన్నింటిపై కూలంకషంగా అడిగి తెలుసుకున్నారు.ఇందుకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ భవిష్యత్తులో ఇంకా ఎక్కువగా సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కింది నుండి చెరువుగట్టు పైకి పైప్ లైన్ తోపాటు,డిస్ట్రిబ్యూషన్ విధానాన్ని పక్కగా ఏర్పాటు చేసేందుకు పూర్తిస్థాయి లో శాశ్వత ప్రణాళిక రూపొందించి సమర్పించాలని ఆదేశించారు.అదేవిధంగా ప్రస్తుతం చెరువుగట్టు వద్ద 64 టాయిలెట్లు మాత్రమే ఉన్నాయని,అమావాస్య రోజు 30 నుండి 40 వేల మంది భక్తులు వస్తున్నందున బహిరంగ మల,మూత్ర విసర్జన జరుగుతున్నదని కలెక్టర్ దృష్టికి రాగా,తక్షణమే దానిని నిరోధించేందుకు అవసరమైన ప్రణాళికను రూపొందించాలని,
గ్రామపంచాయతీ ద్వారా పూర్తి స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు.విద్యుత్తు సరఫరా పై సైతం కలెక్టర్ సమీక్షించారు.దేవాలయ ఆదాయాన్ని పెంచుకోవడం తో పాటు, ఖర్చులు తగ్గించడంపై దృష్టి సారించాలని,సిబ్బంది బాధ్యతగా పనిచేసే విధంగా చూడాలని,ఉన్నవారితో సాధ్యమైనంత వరకు మంచి పని తీసుకో వాలని,రెగ్యులర్ పనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని,రాబోయే సంవత్సరంలో దేవాలయానికి కావాల్సిన అవసరాలపై ప్రణాళిక రూపొందించా లని జిల్లా కలెక్టర్ చెప్పారు..వీటన్నిటినిపై ప్రణాళికలు రూపొందించలని వచ్చే గురువారం మరోసారి సమీక్షించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ మహేంద్ర కుమార్,ఆలయ ఈవో నవీన్ కుమార్, మండల ప్రత్యేక అధికారి,డిఆర్డిఓ నాగిరెడ్డి, పంచాయతీరాజ్ ఈ ఈ భూమన్న, ఎంపీడీవో ఉమేష్, వివిధ శాఖల అధికారులు, తదితరులు హాజరయ్యారు.

## ఉద్యోగులు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

నిర్వహించడం జరిగిరది.గురువారం నాటి ప్రత్యేక వైద్య శిబిరానికి 287 మంది పురుష, 140 మంది మహిళా ఉద్యోగులు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో 102 మందికి మధుమేహం, బీపీ పరీక్షలు, 85 మందికి ఈసీజి పరీక్షలు నిర్వహించారు. 346 మందికి వివిధ పరీక్షల నిమిత్తం రక్త నమూనాలు సేకరించారు.ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు మాట్లాడుతూ, తాము ఆరోగ్యవంతంగా ఉండేలా, ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు జిల్లా కలెక్టర్ కు ధన్యవాదాలు తెలిపారు. వైద్య పరీక్షల వలన వైద్య అధికారుల సూచనలతో భవిష్యత్తులో ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా అన్ని జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉంటూ, తమ విధులను సమర్ధవంతంగా నిర్వహించగలుగు తామని అన్నారు. ఉద్యోగుల ఆరోగ్య నిమిత్తం ప్రత్యేక శ్రద్ధతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గతంలో సైతం పరీక్షలు నిర్వహించామని ప్రస్తుతం మరో సారి జిల్లా ఆసుపత్రిలో పని చేసే ఫిజిషియన్ తో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరానికి కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డిఆర్డీవో సన్యాసయ్యలు, అధికారులు, ఉద్యోగులందరూ వినియోగించుకున్నార ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డా. బి. మాలతి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్ గౌడ్ లు తెలిపారు.ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, జిల్లా ఆసుపత్రి ఫిజిషియన్లు, గైనకాలజిస్టులు, వివిధ విభాగాల స్పెషలిస్టులు, వైద్యాధికారులు, మెడికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

**- ఇంచార్జ్ ఎంపీడీవో బత్తిన శ్రీనివాసరావు**

**- ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు**

ఆళ్లపల్లి జులై 25 (జనంసాక్షి)
గత వారం రోజులు గా మండలంలోని అనేక సమస్యలపై ప్రతి గ్రామంలో పరిశీలిస్తూ ,లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు ఉధృతంగా ప్రవహిస్తే దాటే ప్రయత్నం చేరాదని ఇంచార్జ్ ఎంపీడీవో బత్తిన శ్రీనివాసరావు అన్నారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాలలో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రతి గ్రామంలోని కాలనీలలో పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకుంటూ గోలాలలో, డ్రమ్ముళ్లలో, బకెట్లలో నిలువ ఉంటే నిరు తొలగించాలని, ప్రజలకు సూచించారు. అదేవిధంగా ఇష్ట రాజ్యంగా రహదారుల వెంట చెత్తాచెదారం వేయరాదని తెలిపారు. గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ఈ వారం రోజులుగా చేపట్టామని తెలిపారు. వాగులు ఉధృతంగా ప్రవహించడంతో దాటే ప్రయత్నం చేయకుండా అనునిత్యం పరిశీలించారు.



# నిరుద్యోగుల సమస్యలు అడిగితే అక్రమ అరెస్టులా ?...



చింతపల్లి జూలై 25(జనం సాక్షి)
రాష్ట్రంలోని నిరుద్యోగులు, సమస్యలు పరిష్కరించాలని బీజేవైఎం అదేశాల మేరకు గురువారం అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న నాయకులను పోలీసులు ముందస్తు అక్రమ అరెస్టు చేశారు..ఈ.ఈ సందర్బంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యల పరిష్కరిస్తాము నిరుద్యోగ భృతి అనిపిస్తుంది జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని నమ్మబలికి ఉచిత హామీల పేరుతో యువతను ఇటు తెలంగాణ ప్రజలను మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి గుర్తుంచుకో తెలంగాణ గడ్డ పోరాటాల గడ్డ పోరాటాలను అక్రమ అరెస్టులతోటి నిలువరించాలనే మూర?పు ఆలోచన అరిచేతు తో సూర్యుని ఆపడం లాంటిదే తెలంగాణలో నిరుద్యోగులకు న్యాయం చేసే వరకు న్యాయం జరిగే వరకు భారతీయ జనతా పార్టీ యువ మోర్చా నిరుద్యోగుల పక్షాన పోరాటానికి సిద్ధమని తెలిపారు అరెస్ట్ అయిన వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేనమోని రాములు, మండల అధ్యక్షులు శివర్ల రమేష్ యాదవ్ ,జిల్లా కార్యవర్గ సభ్యులు సముద్రాల నగేష్, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేష్ , గజ్జె అభినవ్ , కుందేళ్ళ శ్రీశైలం , ముగిలమోని మల్లేష్, ముగిలమోని రవి, పాలకుల రాజు, గడ్డి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

## తుంగతుర్తి ఎక్సైజ్ శాఖ పరిధిలో నేడే వాహనాల వేలం...

తుంగతుర్తి జులై 25 (జనం సాక్షి)
తుంగతుర్తి ఎక్సైజ్ శాఖ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు నేడు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ప్రోహిబిషన్ ఎక్సైజ్ సీఐ రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో జిల్లా ప్రోహిబిషన్ ఎక్సైజ్ అధికారి సమక్షంలో ఉదయం 10 గంటలకు తుంగతుర్తి ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేలం లో టీవీఎస్ ఎక్సెల్ . బజాజ్. సిడి హండ్రెడ్. బజాజ్ డిస్కవర్. మాస్ట్రో ఎడ్జ్. ద్విచక్ర వాహనాలను వేలం పాటలు ఉంచినట్లు ఆసక్తిగల వారు ఈ వేలంలో ధరావత్ చెల్లించి వాహనాలను తనిఖీ చేసుకొని పాల్గొనాలని కోరారు.

## నిషేధిత గుట్కా పాకెట్లు పట్టివేత

మేళ్లచెరువు (జనంసాక్షి న్యూస్)



రాష్ట్ర ప్రభుత్వం నిషేదించిన గుట్కా పాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పి పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందినకలిదిండి నరసింహ రావు, చిన్నపంగు సుధాకర్ లకు చెందిన కిరాణా షాపులను తనిఖీ చేయగా భారీ మొత్తంలో గుట్కా పాకెట్లు దొరినట్లు అయన తెలిపారు. నిషేధిత గుట్కా అమ్ముతున్న కారణంగా పైన పేర్కొన్న ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## మృతురాలు కుటుంబానికి మంత్రి ఆర్థిక సహాయం

నల్లగొండ పట్టణంలోని గాంధీనగర్ 39 వార్డుకు చెందిన కొండ్రతి అంజమ్మ గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రోడ్లు %ఌ% భవనాలు, సినీమటోగ్రఫీ శాఖ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెంటనే స్పందించి తక్షణ సహాయం కింద పార్టీ శ్రేణుల ద్వారా గురువారం రూ.10 వేల సహాయం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కత్తుల కోటి, బోనగిరి ప్రభాకర్ ,బోడ ప్రభాకర్, సాయి ,ఆవుల వెంకన్న పాల్గొన్నారు.నల్గొండ మండలం పెద్ద సూరారం గ్రామంలో ముసుకు సుజన అనారోగ్యంతో మృతి చెందగా గురువారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.అనంతరం వారి కుమారులు సైదులు,రవిలను పరామర్శించి వారికి కాంగ్రెస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో దహన సంస్కారాల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందచేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిల్లి గిరి యాదవ్, మాజీ ఎంపీటీసీ పెండెం రత్నమాల పాండు, ఏడు దొడ్ల వెంకటరామిరెడ్డి, నరేష్ పటేల్, ప్రవీణ్, పురుషోత్తం,వెంకన్న, జానయ్య, యాదయ్య ,బిక్షం, లింగయ్య, యాదయ్య, వీరయ్య,కృష్ణయ్య ,ముత్తయ్య వెంకటయ్య వాసు,తదితరులు పాల్గొని వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

## అనుమతి లేకుండా నడుస్తున్న హాస్పిటల్స్ సీజ్

నేరేడుచర్ల, జులై 25( జనంసాక్షి) :




ఎటువంటి డాక్టర్స్ లేకుండా,ఫార్మసిస్ట్ లు, ల్యాబ్ టెక్నీషియన్ లేకుండా హాస్పటల్స్ నడిపిస్తూ ఇన్ పేషంట్ లకు ట్రీట్ మెంట్ అందిస్తున్నందున నేరేడుచర్ల మండల కేంద్రంలోని అమ్మ హాస్పిటల్,శ్రీ సాయి శ్రీనివాస హాస్పిటల్స్ని జిల్లా కలెక్టర్,డి హెచ్ ఎం వో.డాక్టర్ .కోటాచలం ల ఆదేశానుసారం సీజ్ చేశామని నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యధికారిణి పి. నాగిని తెలిపారు.ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతు , అనుమతులు లేకుండా నడుస్తున్న హాస్పటల్ ల రిజిస్ట్రేషన్ గురించి,ఫార్మసీ,ల్యాబ్ టెక్నీషియన్ ,డ్యూటీ డాక్టర్స్ గురించి అడిగి పర్యవేక్షణ చేయటం జరిగిందని,అన్ని హాస్పటల్ నియమ నిబంధనలు పాటించి నడిపించాలని,ఎటువంటి అనుమతి లేకుండా హాస్పటల్ ను నడిపితే మూసివేయమని జిల్లా కలెక్టర్ మరియు, డీహెచ్ఎంవో ఆదేశానుసారం సీజ్ చెయ్యడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో సి హెచ్ వో శ్రీనివాస్ ,హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, పాల్గొన్నారు.



## రైతుల రుణ విముక్తి కోసం కృషి చేస్తా..

**- డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు**

చంద్రుగొండ జులై 25 (జనంసాక్షి):
రుణమాఫీ కానీ రైతులను రుణ విముక్తులను చేసేందుకు కృషి చేస్తానని, ఆ దిశగా రాష్ట్ర మంత్రి తుమ్మల, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ల దృష్టికి సమస్యను తీసుకెళ్తానని డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. గురువారం స్థానిక డిసిసిబి బ్రాంచ్ ను సందర్శించారు. ఈ సందర్భంగా గానుగపాడు సొసైటీ చైర్మన్, గుంపెన సొసైటీ చైర్మన్, చందర్రావు, సుధాకర్ రావు లు పహానిల ద్వారా రుణాలు పొందిన రైతులను పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని వినతిని అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిసిసిబి చైర్మన్ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా డిసిసిబి పరిధిలో ఇప్పటివరకు 37,625 మంది రైతులకు రూ.121. 63 కోట్ల రుణమాఫీ అయిందన్నారు. 1.69,864 మంది రైతులు రూ. 908. 27 కోట్ల రుణాలు పొందాలని వీరందరికీ రుణమాఫీ కావాల్సి ఉందన్నారు. అనంతరం గానుగపాడు గుంపెన సొసైటీ చైర్మన్లు డిసిసిబి చైర్మన్ ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నల్లమోతు వెంకటనారాయణ, దారా బాబు, మేడ మోహన్ రావు, డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ ప్రసన్న, గానుగపాడు సొసైటీ సీఈవో లంక నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# వృత్తిదారుల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్

**చేనేత, మత్స్య రంగాల అభివృద్ధికి నిధులు పెంచాలి**



నల్గొండ ఆర్సి, జులై 25(జనంసాక్షి)
జూలై 23న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో వృత్తిదారుల సంక్షేమాన్ని విస్మరించిందని తెలంగాణ చేతి వృత్తిదారుల సమన్వయ సంఘం రాష్ట్ర నాయకులు బండా శ్రీశైలం, జిల్లా కన్వీనర్ గంజి మురళీధర్ ఆరోపించారు.గురువారం దొడ్డి కొమరయ్య భవన్లో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో చేనేత, మత్స్య పరిశ్రమల అభివృద్ధికి అతి తక్కువ నిధులు కేటాయించడం విచారకరమని అన్నారు. దేశంలో వ్యవసాయం తర్వాత రెండో ప్రధాన రంగమైన చేనేతకు చేయూతనిస్తామని బిజెపి ఎన్నికలకు ముందు బడ్జెట్లో 5000 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి నేడు అతి తక్కువ 200 కోట్లు కేటాయించడం విచారకరమని అన్నారు. గత ఏడాది 250 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ బడ్జెట్లో 50 కోట్లు తగ్గించారు. దేశవ్యాప్తంగా 1.83 కోట్ల జనాభా కలిగిన చేనేత కార్మికులకు పని లేక నేసిన వస్త్రాలు విక్రయం కాక అర్ధాకలితో అలమటిస్తూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత సంక్షేమ పథకాలు అంతంతమాత్రంగానే అమలవుతున్నాయని ప్రస్తుతం చేనేతకు 200 కోట్లు మాత్రమే కేటాయించడంతో కొత్త సంక్షేమ పథకాలు రాకపోగా గతంలో ఉన్న సంక్షేమ పథకాలకు కూడా మంగళం పాడే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం టెక్స్టైల్ రంగం కార్పొరేట్ రంగాలకు నిధులు పెంచి చేతి వృత్తిదారులను విస్మరించడం సిగ్గుచేటు అని అన్నారు బడ్జెట్లో ఉపాధి కనీస వేతనాల ఊసే లేదని అన్నారు. ఇచ్చిన బడ్జెట్ జీతభత్యాలకి సరిపోదని సంక్షేమం ఎలా చేపడతారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే బడ్జెట్ సవరణ చేసి చేనేత ఇతర వృత్తిదారుల సంక్షేమం కోసం 30 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో తెలంగాణ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా నాయకులు కొండ వెంకన్న, అవిశెట్టి శంకరయ్య, మురారి మోహన్, చెరుకు పెద్దలు, జేరిపోతుల ధనంజయ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.